# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
• జిల్లా బ్యూరో చీఫ్‌లు
• జిల్లా స్టాఫ్ రిపోర్టలు
• నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
• మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 223 మంగళవారం 20 ఫిబ్రవరి 2024 పేజీలు : 8 వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




రానున్న రోజుల్లో డబుల్ ఇంజిన్ సర్కార్‌ను

## ఏర్పాటు చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆరు గ్యారెంటీలనూ అమలు చేస్తామన్న పొన్నం
- సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆరువేల బస్సులు కేటాయించామన్న మంత్రి
- అందుకే గ్రామాలలో ఈ నెల 25వ తేదీ వరకు బస్సుల కొరత ఉంటుందని వెల్లడి

ఆ జాబితాపై

# ఉత్కంఠ



ఢిల్లీకి సీఎం రేవంత్.. హైకమాండ్‌తో భేటీ

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంలో కార్పొరేషన్ పదవుల భర్తీ తదితర అంశాలపై హైకమాండ్‌తో రేవంత్ చర్చించనున్నట్లు సమాచారం?.

హైదరాబాద్:

పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ టూర్‌లో ఆయన కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో భేటీ అవనున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంలో కార్పొరేషన్ పదవుల భర్తీ తదితర అంశాలపై హైకమాండ్‌తో రేవంత్ చర్చించనున్నట్లు సమాచారం?. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ దరఖాస్తులు స్వీకరించింది. బీఆర్ఎస్ నుంచి కొత్తగా పార్టీలోకి వస్తున్నవారితో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లివ్వకపోయినా సర్దుకుపోయిన సొంత పార్టీ నేతల నుంచి ఎంపీ టికెట్ల విషయంలో ఒత్తిడి తీవ్రంగా ఉంది. ఎంపీ టికెట్లివ్వలేని వారికి కార్పొరేషన్ పదవులిచ్చి బుజ్జగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ అంశాలపై అధిష్టానంతో చర్చించడానికి సీఎం ఢిల్లీకి వెళుతున్నట్లు తెలుస్తోంది.

ఐదేళ్లపాటు పలు రకాల పంటలను

## కనీస మద్దతు ధరకు కొనుగోలు



- హామీ ఇచ్చిన కేంద్రం ప్రభుత్వం
- కొనుగోళ్లపై ఎలాంటి పరిమితి ఉండదు..
- దీని కోసం ఒక పోర్టల్ కూడా అభివృద్ధి చేస్తాం
- వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ వెల్లడి
- ఢిల్లీ శివారులో రైతులు చేపట్టిన ఆందోళనలు సత్ఫలితాలు

## యూపీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది

- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో యూపీలో పరిస్థితులు మారిపోయాయి
- గడిచిన 7 ఏళ్లలో యూపీలో అద్భుతమైన అభివృద్ధి జరిగింది
- భారత్‌లో అభివృద్ధిపై విదేశాల్లో చర్చ జరుగుతోంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



# ఢిల్లీకి కెసిఆర్

- ఏం చేయబోతున్నారు?
- ఈ వారం కెసిఆర్ ఢిల్లీకి వెళ్తారని ప్రచారం
- లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ
- ఢిల్లీ ప్రచారంపై బోలెడు ఊహాగానాలు
- బీజేపీతో చర్చలు జరుపుతారని ఒక వాదన




హైదరాబాద్

బీఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్.. మళ్లీ యాక్టివ్ అవుతున్నారు. త్వరలో ఆయన ఢిల్లీకి వెళ్లనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత కెసిఆర్ చేస్తున్న మొదటి సారి పర్యటన ఇది. రాష్ట్రంలో తాజా రాజకీయాల నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాదాన్యత ఏర్పడింది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బిఅర్ఎస్, బిజెపి ల మద్య పొత్తు ఉంటుందని జోరుగా ప్రచారం జరిగినా.. పొత్తు అవకాశాలను రెండు పార్టీల నేతలు కొట్టి పారేస్తున్నారు. కెసిఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కూడా ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉంది. ఢిల్లీలో కెసిఆర్ రాజకీయ చర్చల కోసం వస్తున్నారన్న వార్తలను మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఖండించారు. అసలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డితో పొత్తుల గురించి ఎవరు మాట్లాడారని ప్రశ్నించారు. "మేము కిషన్ రెడ్డి తో ఏమైనా -మిగతా3లో

## గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ

- నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ వెబ్ నోట్ ఇచ్చిన టీఎస్‌పీఎస్సీ
- పేపర్ లీకేజీ కారణంగా 2022 ఏప్రిల్ నాటి గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు
- 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇవ్వనున్న టీఎస్‌పీఎస్సీ

## బీజేపీ విజయ సంకల్ప రథయాత్ర



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- కోమరంభీం యాత్ర బాసర సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో యాత్రం ప్రారంభం అవుతుంది
- రాజరాజేశ్వరీ విజయ సంకల్ప యాత్ర కరీం నగర్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల నాలుగు పార్లమెంట్ స్థానాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనుంది.
- కోమరంభీం యాత్ర బాసర సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో యాత్రం ప్రారంభం అవుతుంది
- రాజరాజేశ్వరీ విజయ సంకల్ప యాత్ర కరీం నగర్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల నాలుగు పార్లమెంట్ స్థానాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనుంది.

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో విజయ సంకల్ప రథయాత్రకు బీజేపీ శ్రీకారం చుట్టనుంది. రేపట్నుంచి(మంగళవారం) రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయ సంకల్ప రథయాత్రను ప్రారంభిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ చేపట్టబోయే విజయ సంకల్ప యాత్ర గురించి వివరాలు వెల్లడించారు. 'రేపటి నుంచి విజయ సంకల్ప రథ యాత్ర ప్రారంభం కానుంది. రేపు నాలుగు యాత్రలు ప్రారంభం కానున్నాయి .కోమరంభీం యాత్ర బాసర సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో యాత్రం ప్రారంభం అవుతుంది. రాజరాజేశ్వరీ విజయ సంకల్ప యాత్ర కరీం నగర్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల నాలుగు పార్లమెంట్ స్థానాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనుంది. ఇందులో 22 అసెంబ్లీలు కవర్ చేయనుంది. మిగిలిన నియోజక వర్గాలను సైతం కవర్ చేసేందుకు కృషి చేస్తాం. భాగ్యలక్ష్మి విజయ సంకల్ప యాత్ర.. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదంతో ప్రారంభం అవుతుంది. భువనగిరి -మిగతా3లో

## మేడారం జాతర రోజుల్లో హైదరాబాదు నగరంలో తిరిగేవి తక్కువ బస్సులే!



- ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మేడారం జాతర
- హైదరాబాద్ పరిధిలోని 2850 బస్సుల్లో 2000 మేడారంకు కేటాయింపు
- హైదరాబాద్‌లో అందుబాటులో ఉండే బస్సులు 850 మాత్రమే

# చండీగఢ్ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు సీరియస్





న్యూఢిల్లీ: చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను తారుమారు చేశారన్న కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకున్నందుకు చండీగఢ్ రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్‌ను ప్రాసిక్యూట్ చేయాలని పేర్కొంది. ఆయన్ను మంగళవారం కూడా విచారణకు రావాలని తెలిపింది. అంతేగాక మేయర్ ఎన్నికకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలను రేపు సుప్రీంకోర్టుకు తీసుకురావాలని ఆదేశించింది. అందుకోసం ఒక జ్యుడిషియల్ అధికారిని నియమించాలని పంజాబ్?, హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్?ను ఆదేశించింది. జ్యుడిషియల్? అధికారికి, రికార్డులకు భద్రత కల్పించాలని తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు బ్యాలెట్ పేపర్లు, ఓట్ల లెక్కింపు మొత్తం వీడియో రికార్డింగ్‌ను పరిశీలిస్తామని పేర్కొంది. సు చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు సోమవారం విచారణ జరిపింది. అయితే రిటర్నింగ్ అధికారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం స్వతంత్ర భారత చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం.

**నిజాయితీగా సమాధానాలు చెప్పండి: సుప్రీం**

చండీగఢ్ మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్? అత్యున్నత న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం అనిల్ మసీహ్‌ను పలు సూటి ప్రశ్నలు సంధించింది. నిజాయితీగా సమాధానాలు చెప్పకుంటే తనపై విచారణ చేస్తామని హెచ్చరించింది. ఇది తీవ్రమైన విషయమని పేర్కొన్న ధర్మాసనం... 'మేం వీడియో చూశాము. బ్యాలెట్ పేపర్లపై క్రాస్ మార్కులు వేస్తూ కెమెరాను చూసి ఏం చేస్తున్నారు? ఎందుకు మార్కులు వేస్తున్నారు అని ప్రశ్నించింది. ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై క్రాస్ మార్కులు వేసినట్లు అంగీకరించిన రిటర్నింగ్ అధికారి.. చెడిపోయిన బ్యాలెట్ పత్రాలను వేరుచేయవలసి ఉన్నందున తాను అలా చేశానని బదులిచ్చారు. 'మీరసలు బ్యాలెట్ పత్రాలను ఎందుకు పాడు చేశారు. పత్రాలపై సంతకం మాత్రం చేయడమే మీ బాధ్యత. మీరు బ్యాలెట్ పత్రాలపై ఇతర గుర్తులు వేయవచ్చని నిబంధనలలో ఎక్కడ పొందుపరిచారు' అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. అనంతరం చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్ తరపున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా వైపు తిరిగి.. రిటర్నింగ్ అధికారి అనిల్ మసీహ్‌ను రేపు మళ్లీ ప్రాసిక్యూట్ చేయాల్సి ఉంది. ఎన్నికల ప్రక్రియలో ఆయన జోక్యం చేసుకుంటున్నాడని సీజేఐ పేర్కొన్నారు. తాజాగా ఎన్నికలు నిర్వహించే బదులు కొత్త రిటర్నింగ్ అధికారితో ఓట్లను లెక్కించాలని తొలుత ప్రతిపాదించారు బ్యాలెట్ పత్రాలను పరిశీలించిన తర్వాత ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. జనవరి 30న జరిగిన మేయర్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎనిమిది ఓట్లు చెల్లవని రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్ ప్రకటించడంతో బీజేపీకి చెందిన మనోజ్ సోంకర్ చేతిలో ఆప్ మేయర్ అభ్యర్థి కుల్దీప్‌కుమార్ నాలుగు ఓట్ల తేడాతో ఓడిపోయారు. బీజేపీ మైనారిటీ సెల్ సభ్యుడు మిస్టర్ మసీహ్ ఉద్దేశపూర్వకంగా ఓట్లను చెల్లుబాటు చేయలేదని ఆప్ ఆరోపించింది. ఈ క్రమంలోనే రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేసిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఇందులో అతడు కెమెరాను చూస్తూ కొంతమంది ఆప్ కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలపై ఏదో రాస్తున్నట్లు కనిపిస్తుంది.దీంతో ఆప్ కౌన్సిలర్ ఒకరు సుప్రీంను ఆశ్రయించారు. తొలుత ఈ పిటిషన్‌పై ఫిబ్రవరి 5న విచారించిన సుప్రీంకోర్టు.. అనిల్ మసీహ్ చర్య ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని పేర్కొంది.

## బీజేపీలో చేరికపై కమలనాథ్ యూటర్న్..

బీజేపీలో చేరికపై కమలనాథ్ యూటర్న్ తీసుకున్నారు. సోమవారం రాహుల్ గాంధీ, మల్లికార్జునతో కమల్ నాథ్ భేటీ అయ్యారు. అనంతరం కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని వెల్లడించారు కమల్‌నాథ్. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు షాక్.. పార్టీ వీడనున్న సీనియర్ నేత కమల్‌నాథ్.. కొడుకుతోపాటు బీజేపీలోకి మాజీ సీఎం.. గత రెండు రోజులుగా వినిపిస్తున్న వార్తలివీ.. ఈటీవల జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం తర్వాత పార్టీ చీఫ్ పదవి నుంచి తనను తొలగించడంతో అధిష్టానంపై కోపం ఉన్న మాజీ సీఎం కమల్‌నాథ్ తన కుమారుడు నకుల్‌నాథ్‌తో కలిసి బీజేపీలో చేరుతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనికి తోడు రాష్ట్రం నుంచి రాజ్యసభకు అవకాశం ఇస్తారనుకుంటే కమల్‌నాథ్‌కు హస్తం మొండిచేయి చూపడంతో ఆయన మరింత అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. తాజాగా కమల్‌నాథ్ పార్టీ వీడటంపై క్లారిటీ వచ్చింది. సోమవారం రాహుల్ గాంధీ, మల్లికార్జున కమల్ నాథ్‌తో భేటీ అయి బుజ్జగించారు. దీంతో బీజేపీలో చేరికపై కమలనాథ్ యూటర్న్ తీసుకున్నారు. కాంగ్రెస్ లోనే కొనసాగుతానని వెల్లడించారు. అంతకముందే కమల్‌నాథ్ ఏ పార్టీలో చేరడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జితేంద్ర సింగ్ ఆదివారం సాయంత్రం వెల్లడించారు. ప్రస్తుత మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతూ పట్వారి కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. "ఇది కమల్‌నాథ్‌పై జరిగిన కుట్ర. నేను ఆయనతో మాట్లాడాను. ఇవన్నీ వదంతులు మాత్రమేనని, తాను కాంగ్రెస్ వ్యక్తినని, కాంగ్రెస్ వ్యక్తిగా కొనసాగుతానని.. తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్ భావజాలాన్ని కొనసాగిస్తానని చెప్పారు.

# ఐదేళ్లపాటు పలు రకాల పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు



**న్యూఢిల్లీ** : తమ డిమాండ్ల సాధనకు ఢిల్లీ శివారులో రైతులు చేపట్టిన ఆందోళనలు సత్ఫలితాలనిస్తున్నాయి. రైతులు డిమాండ్లలో ఒకటైన కనీస మద్దతు ధరకు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. ఐదేళ్లపాటు పలు రకాల పంటలను కనీస మద్దతు ధర(ఓూఖ)కు కొనుగోలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఢిల్లీ చలో పేరిట ఆందోళన చేపట్టిన రైతులతో కేంద్రం జరిపిన నాలుగో విడత చర్చలు ముగిశాయి. ఆదివారం రాత్రి రైతు నేతలతో కేంద్రం తరపున వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్, హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ చర్చలు జరిపారు. రైతులు, కేంద్రం మధ్య జరిగిన ఈ చర్చల్లో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 8.15 గంటలకు ప్రారంభమైన ఈ చర్చలు సోమవారం తెల్లవారుజామున ఒంటి గంటకు వరకు ముగిశాయి.సమావేశం అనంతరం పీయూష్ గోయెల్ మాట్లాడుతూ.. "రైతులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ఐదేళ్లపాటు పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటలను ప్రభుత్వ ఏజెన్సీలు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాయని మా బృందం ప్రకటించింది. మినుములు, మైసూర్ పప్పు, కందులు, మొక్కజొన్న పండించే రైతులతో ఎన్‌సీపీఎఫ్, ఎన్ఏఎఫ్ఈడీ వంటి సహకార సంఘాలు ఒప్పందం కుదుర్చుకుంటాయి. కొనుగోళ్లపై ఎలాంటి పరిమితి ఉండదు. దీని కోసం ఒక పోర్టల్ కూడా అభివృద్ధి చేస్తాం. దీంతో పంజాబ్‌లో వ్యవసాయానికి రక్షణ లభిస్తుంది. భూగర్భ జలమట్టాలు మెరుగవుతాయి. సాగు భూములు సిస్సారంగా మారకుండా ఉంటాయి." అని తెలిపారు. ఇక ప్రభుత్వ ప్రాతిపాతనపై నిపుణుల అభిప్రాయం తీసుకున్న తర్వాత తమ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. మరో రెండు రోజుల్లో తమ ఇతర డిమాండ్లు కూడా పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కాగా కనీస మద్దతు ధరతోపాటు రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, నిరసనల సందర్భంగా వారిపై పెట్టిన పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి కేంద్రం కనీస మద్దతు ధరకే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిగతావాటి గురించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే కనీస మద్దతు ధరకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతానికి రైతులు తమ ఆందోళనను విరమించనున్నారు. అయితే తమ డిమాండ్లన్నీ నెరవేర్చకుంటే ఫిబ్రవరి 21న పాదయాత్రను పునఃప్రారంభిస్తామని రైతులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు.. పార్టీని వీడుతున్న సీనియర్ నేతలు ?



**న్యూఢిల్లీ** : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. గతంలో సీఎంలుగా, కేంద్ర మంత్రులుగా చేసిన సీనియర్ నేతలు ఒక్కొక్కరిగా ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. ఇటీవలి కాలంలో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, మాజీ ఎంపీ మిలింద్ దేవ్‌రా వంటి నేతలు కాంగ్రెస్‌ను వీడగా.. తాజాగా ఆ జంపింగ్ లిస్టులో మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్‌తోపాటు పార్టీలో సీనియర్ నేతగా ఉన్న ఎంపీ మనీశ్ తివారీ పేర్లు కూడా రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న తివారీ.. బీజేపీతో టచ్‌లో ఉన్నారని, ఆయన లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌ను వీడి బీజేపీతో చేరనున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. మనీశ్ తివారీ బీజేపీ టికెట్‌పై లూథియానా స్థానం నుంచి పోటీచేసేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఢిల్లీ చేరుకొన్న కమల్‌నాథ్ వర్గం ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు మాజీ సీఎం కమల్‌నాథ్ తన కుమారుడు, ఎంపీ నకుల్‌నాథ్‌తో కలిసి ఢిల్లీ చేరుకొన్నారని ఓవైపు ప్రచారం జరుగుతుండగా.. ఇందుకు బలం చేకూర్చేలా కీలక పరిణామం చోటుచేసుకొన్నది. కమల్‌నాథ్‌కు విధేయులుగా భావించే మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం ఢిల్లీ చేరుకొన్నారు. చింధ్వారా రీజియన్‌కు చెందిన వీరంతా కమల్‌నాథ్‌తో కలిసి కమలం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్యాంపులో మాజీ మంత్రి లఖన్ గంగోరియా కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. వీరంతా కాంగ్రెస్ అగ్రనేతల ఫోన్లకు స్పందించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా పార్టీ ఎమ్మెల్యేలను తమ వెంట తీసుకెళ్లేందుకు కమల్‌నాథ్ వర్గం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

**కాంగ్రెస్ నుంచి బయటకు సీనియర్లు**

కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నేతలు వరుసకట్టి బయటకు వెళ్తున్నారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్‌తో సహా గత పదేండ్లలో ఏకంగా తొమ్మిది మంది మాజీ ముఖ్యమంత్రులు హస్తానికి రాంరాం చెప్పారు. ఈ జాబితాలో అమరిందర్ సింగ్(పంజాబ్), గులాం నబీ ఆజాద్(జమ్ముకశ్మీర్), విజయ్ బహుగుణ(ఉత్తరాఖండ్), అజిత్ జోగి(చత్తీస్‌గఢ్), ఎస్ఎం కృష్ణ(కర్ణాటక), నారాయణ్ రాణే(మహారాష్ట్ర), గిరిధర్ గమాంగ్(ఒడిశా) ఉన్నారు.అశోక్ చవాన్ గత వారం కాంగ్రెస్‌ను వీడగా.. గత నెల జనవరిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు సన్నిహితుడు, మాజీ ఎంపీ మిలింద్ దేవ్‌రా కూడా బయటకు వెళ్లిపోయారు. పార్టీ నాయకత్వం నుంచి గాంధీ కుటుంబం తప్పుకొని, ఇతర నేతలకు అవకాశం ఇవ్వాలని 2022లో డిమాండ్ చేసిన సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబల్.. తర్వాత రెండు నెలలకే కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇంకా ఆ పార్టీని వీడిన వారిలో పంజాబ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు సునీల్ జక్కర్, జ్యోతిరాదిత్య సింధియా, సుస్మితా దేవ్, ఆర్పీఎన్ సింగ్, అశ్విని కుమార్, హార్దిక్ పటేల్ వంటి నేతలు ఉన్నారు.

## రాజకీయాల్లో ఒంటరిగానే ఉంటా.. మళ్లీ బీజేపీలో చేరబోను ..

**స్పష్టం చేసిన మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి**

**బెంగళూరు** : రాజకీయాల్లో ఒంటరిగానే ఉంటానని, మళ్లీ బీజేపీలో చేరబోనని కర్ణాటక రాష్ట్రం కొప్పళ జిల్లా గంగావతి ఎమ్మెల్యే, మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. కొప్పళలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ లో చేరడమనేది కలలో కూడా జరగదన్నారు. కాంగ్రెస్ తో సంబంధాలు ఎప్పటికీ ఉండవన్నారు. ప్రధాని మోదీ పాలన అద్భుతమని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గాలి జనార్దనరెడ్డి మరోసారి బీజేపీలోకి చేరుతారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. సీఎం సిద్దరామయ్య శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బీజేపీ, జేడీఎస్ బాయ్‌కాట్ చేసినా జనార్దనరెడ్డి సభలోనే ఉన్నారు. తర్వాత సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో కలిసి ఫొటోలు దిగారు. దీంతో ఆయన కాంగ్రెస్ వైపు వెళ్తారనే ప్రచారం సాగింది.

## వైసీపీ నేతల ఓటర్ల ప్రలోభ పర్వంపై సీఈసీ ఆగ్రహం వ్యక్తం

**న్యూఢిల్లీ** : వైసీపీ నేతల ఓటర్ల ప్రలోభ పర్వంపై సీఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫ్యాన్ గుర్తుతో ఓటర్లకు కుక్కర్లు, ఫ్లాస్కులతో పాటు గిఫ్టులను అందజేస్తున్నట్లు వైసీపీ నేతలపై ఎంపీ రఘురామ ఇచ్చిన ఫిర్యాదుపై సీఈసీ స్పందించింది. నివేదిక పంపాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారితో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులకు సీఈసీ లేఖ రాసినట్లు సమాచారం. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని కూడా సీఈవోకు ఆదేశించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది.వైసీపీ నేతలు జోగి రమేశ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లంపల్లి శ్రీనివాస్ బహుమతులు పంచడం, చర్చిలలో ప్రచారం చేస్తున్న వీడియోలను కూడా జతచేసి ఎన్నికల కమిషన్‌కు రఘురామ ఫిర్యాదు చేశారు. అధికారులు కూడా వైసీపీ నేతల నుంచి గిఫ్టులు అందుకుంటున్నారని, ఇది వారి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికారులను కూడా వైసీపీ పూర్తి స్థాయిలో ఉపయోగించుకున్నట్లు ఎంపీ తెలిపారు. చర్చిలలో పాస్టర్ల వద్ద వైసీపీకి ఓటు వేయాలని ప్రమాణం చేయించినట్లు జోగి రమేశ్ వీడియోలను సీఈసీకి అందజేశారు. మతం పేరుతో ఓట్లు అడుగుతున్న జోగి రమేశ్‌ను అనర్హునిగా ప్రకటించాలని ఎంపీ రఘురామ డిమాండ్ చేశారు.

## పెళ్లి వేడుకలో కాల్పులు.. పాక్ గ్యాంగ్‌స్టర్ మృతి




**లాహోర్:** పాకిస్థాన్‌లో మరో గ్యాంగ్‌స్టర్ దారుణ హత్యకు గురయ్యాడు. లాహోర్ అండర్ వరల్డ్ డాన్, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ చీఫ్ అమీర్ బలాజ్ టిపును ఓ దుండగుడు కాల్చిచంపేశాడు. ఆదివారం లాహోర్‌లోని చంగ్ ప్రాంతంలో ఓ వివాహ వేడుకకు హాజరైన అమీర్‌తోపాటు మరో ఇద్దరు అతిథులపై గుర్తు తెలియని ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అప్రమత్తమైన ఆమీర్ సహాయకులు ఎదురు కాల్పులు జరపగా ఆ కాల్పుల్లో షూటర్ అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన వారిని హుటాహుటిన జిన్నా ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ అమీర్ ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అసలు ఆయనపై దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని వెల్లడించారు. కాగా 2010లో అల్లమా ఇక్బాల్ విమానాశ్రయంలో జరిగిన ఘోరమైన తుపాకీ కాల్పుల్లో ఆమీర్ తండ్రి ఆరిఫ్ అమీర్, అలియాస్ టిప్పు ట్రక్కన్‌వాలా మృతిచెందాడు. బలాజ్ తాత కూడా గతంలో గొడవలో పాత్ర ఉన్నవాడే. వీరి కుటుంబం మొత్తం హింసాత్మక చరిత్రను కలిగి ఉంది.

## జార్జియా చట్టసభ్యుడిగా ఎన్నికైతే రికార్డే!



భారతీయ అమెరికన్ అశ్విన్ రామస్వామి జార్జియా చట్టసభ్యుడిగా ఎన్నికై రికార్డు సృష్టించనున్నారు. అమెరికాలోని జార్జియా సెనేట్ స్థానానికి పోటీ చేస్తున్న మొదటి జనరల్ జెడ్ (1997–2012 మధ్య పుట్టిన వాళ్లు) భారతీయా అమెరికన్ అశ్విన్ రామస్వామి నిలిచారు. 34 ఏళ్ల క్రితం భారత్? నుంచి అమెరికాకు వలస వెళ్లిన భారతీయ కుటుంబానికి చెందిన 24 ఏళ్ల అశ్విన్.. జార్జియాలోని డిస్ట్రిక్ట్ 48 స్టేట్ సెనేట్ కోసం డెమోక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఆ స్థానానికి రిపబ్లికన్ షాన్ స్టిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. తన రాష్ట్రమైన జార్జియాకు సేవ చేయాలన్న ఉద్దేశంతో తాను సెనెట్‌కు పోటీ చేస్తున్నట్లు అశ్విన్ రామస్వామి తెలిపారు. తనలా రాజకీయంగా ఎదగాలనుకునే ప్రతి ఒక్కరికీ మెరుగైన అవకాశాలు ఉండాలని పేర్కొన్నారు. 24 ఏళ్లకే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, ఎన్నికల భద్రత, టెక్నాలజీతో పాటు పలు రంగాల్లో అశ్విన్ రామస్వామి పని చేశారు. అశ్విన్ రామస్వామి ఎన్నికైతే.. కంప్యూటర్ సైన్స్‌తో పాటు న్యాయవాద డిగ్రీ కలిగి ఉన్న ఏకైక జార్జియా చట్టసభ్యుడిగా రికార్డు సృష్టించనున్నారు. ఇక.. తన తల్లిదండ్రులు 1990లో తమిళనాడు నుంచి అమెరికా వచ్చారని అశ్విన్ తెలిపారు. తాను భారత, అమెరికా సంస్కృతులతో పెరిగిగానని.. తాను హిందువునని తెలిపారు. తనకు భారతీయ సంస్కృతిపై చాలా ఆసక్తి ఉందని.. తాను కాలేజీ సమయంలో సంస్కృతం కూడా నేర్చుకున్నట్లు వెల్లడించారు. తాను రోజూ యోగా, ధ్యానం చేస్తూ ఉంటానని అశ్విన్ పేర్కొన్నారు.

## యూపీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది



**లక్నో:** ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో యూపీలో పరిస్థితులు మారిపోయాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ యూపీ పర్యటనలో భాగంగా.. లక్నోలోని ఉత్తరప్రదేశ్ ఇన్వెస్టర్స్ సదస్సులో మోదీ పాల్గొన్నారు. గ్రౌండ్ బ్రేకింగ్ 4వ ఎడిషనను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎం మోదీ మాట్లాడారు. గడిచిన 7 ఏళ్లలో యూపీలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని అన్నారు.రెడ్ టేప్ సంస్కృతి పోయి.. రెడ్ కార్పెట్ సంస్కృతి వచ్చిందని చెప్పారు. యూపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకొస్తున్నాయని మోదీ తెలిపారు. భారత్‌లో అభివృద్ధిపై విదేశాల్లో చర్చ జరుగుతోందని అన్నారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయి.. ఇది తమ గ్యారెంటీ అని మోదీ స్పష్టం చేశారు. అంతకు ముందు ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పరిధిలోని ఐంచోడ కాంబోహ్‌లోని శ్రీ కల్కి ధామ్ ఆలయానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు.

# మాకు న్యాయం చేయండి...
## రేవంత్ కు డీఎస్సీ అభ్యర్థుల వినతి



**హైదరాబాద్ :** 2008లో నాటి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6వ తేదీన 35 వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఎస్జీటీ పోస్టులను కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామని, బీఈడీ, డీఈడీ అభ్యర్థులు అర్హులని చెప్పింది. సుమారు 50 రోజుల తర్వాత ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం డీఈడీ అభ్యర్థులకు కేటాయిస్తూ 2009 జనవరి 29వ తేదీన జీవో నంబర్ 28ను తీసుకొచ్చింది. బీఈడీ అభ్యర్థులు కోర్టుకు వెళ్లగా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ కూడా కామన్ మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని సూచించింది. దీంతో నోటిఫికేషన్ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం 2010 జూన్ 21న.. జీవో 27ను విడుదల చేసింది. దీని ప్రకారం అధికారులు నియామక కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభించారు.జిల్లాల వారీగా కామన్ మెరిట్ ప్రకారం ఎంపికైన అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించారు. 2009 జూన్ 27వ తేదీన కౌన్సిలింగ్ ప్రక్రియ కూడా మొదలైంది. డీఈడీ అభ్యర్థులు పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. జూన్ 28న కౌన్సిలింగ్‌పై స్టే విధించింది. జీవో 28 ప్రకారం 30 శాతం కోటా కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. దీంతో అధికారులు కౌన్సిలింగ్ నిలిపివేశారు. ఆ తర్వాత 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కొత్త మెరిట్ లిస్టు విడుదల చేసి 2010లో ఉద్యోగాలు ఇచ్చారు. దీంతో మంచి మార్కులు సాధించినా ఉద్యోగం రాక ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 3500 మంది బీఈడీ అభ్యర్థుల కలలు కుప్పకూలిపోయాయి. ఇందులో తెలంగాణ అభ్యర్థులు 1200 మంది వరకు ఉన్నారు. అప్పటి నుంచి వారు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వం చుట్టూ.. కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ధర్నాలు, రాస్తా రోకోలు, నిరాహార దీక్షలు.. ఇలా అన్ని ప్రయత్నాలు చేశారు. 2013 జూలై 15న సుప్రీంకోర్టు బీఈడీ అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే న్యాయం చేస్తామని చెప్పి ఇందిరా పార్కులో హామీ ఇచ్చిన టీఆర్ఎస్.. అధికారంలోకి వచ్చాక మాట మార్చింది2016 జనవరి 3వ తేదీన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా బీఈడీ అభ్యర్థుల ప్రతినిధులను సచివాలయానికి పిలిపించుకున్నారు. వారికి జరిగిన అన్యాయాన్ని వారం రోజుల్లోగా సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పని పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండాలంటూ మంజీరా గెస్ట్ హౌస్‌లో సదుపాయం కల్పించాలని చెప్పారు. ప్రతినిధుల బృందం దాదాపు వారం రోజుల పాటు మంజీరా గెస్ట్ హౌస్‌లో ఉండి ఎదురు చూశారు. కానీ హామీ అమలు చేయలేదు. ఆ తర్వాత వరంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కూడా నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. 2017 ఫిబ్రవరి 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని బెంచ్, 27 సెప్టెంబర్ 2022న హైకోర్టు ధర్మాసనం బీఈడీ అభ్యర్థులకు అనుకూలంగా తీర్పునిచ్చాయి. పిటిషనర్లకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించింది. అయినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా ఈనెల 8వ తేదీన రాష్ట్ర హైకోర్టు డీఎస్సీ 2008 బాధితుల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని గురువారం తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం ఖాళీల్లో వారిని భర్తీ చేయండి లేదా.. నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు ఏపీలో మాదిరిగా కనీసం కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇవ్వండని ఆదేశించింది. ఏపీలో దాదాపు రెండున్నర సంవత్సరాల కింద డీఎస్సీ 2008 బాధితులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చారు. తాజా తీర్పు ప్రకారం మరో 50 మందికి పోస్టింగ్స్ ఇచ్చారు. దాదాపు 15 సంవత్సరాలుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నామని.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

# బుధవారం నుంచి గ్రేటర్ బస్ ప్రయాణికులకు ఇక్కట్లే..

**మేడారం జాతరకు గ్రేటర్ జోన్‌నుంచి 1800 సిటీబస్సులను**

**హైదరాబాద్ నుంచి జాతరకు మరో 400 బస్సులు**

**ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ నుంచి స్పెషల్ ఆపరేషన్స్**

**హైదరాబాద్ :** మేడారం జాతర ఎఫెక్ట్‌తో నగరంలోని సిటీబస్సు ప్రయాణికులకు ఇక్కట్లు తప్పేట్లు లేవు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న మేడారం జాతరకు గ్రేటర్ జోన్‌నుంచి 1800 సిటీబస్సులను నడిపించాలని నిర్ణయించారు. దీంతో గ్రేటర్ జోన్‌లో పరిధిలో బుధవారం నుంచి శనివారం వరకు 800 బస్సులు మాత్రమే తిరగనుండడంతో ఏమేరకు సేవలు అందిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా ప్రతిరోజు ఆర్టీసీ 2,640 బస్సులు నడుపుతూ 21 లక్షలమంది సిటీ ప్రయాణికులను చేరవేస్తోంది. ఈనెల 21నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభ నేపథ్యంలో గ్రేటర్‌జోన్ నుంచి సోమ, మంగళ, బుధవారాల్లో వరుసగా 600 చొప్పున మొత్తం 1800 సిటీ బస్సులను జాతరకు వెళ్లే భక్తులకోసం ఆర్టీసీ కేటాయించింది.జాతరకు లక్షల సంఖ్యలో వెళ్లే భక్తులను దృష్టిలో పెట్టుకొని టీఎ?సఆర్టీసీ మొత్తం 6 వేల ప్రత్యేక బస్సులు నడుపుతోంది. జాతర ప్రాంగణానికి 20-30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల నుంచి భక్తుల రద్దీకి అనుగుణంగా గ్రేటర్‌కు చెందిన సిటీబస్సులను నడపనున్నారు. ఈ బస్సులు ఈనెల 21నుంచి 24 వరకు అక్కడే ఉండి భక్తులకు సేవలందించనున్నాయి. దీంతో సోమవారం 2040 బస్సులు, మంగళవారం 1440 బస్సులు, బుధవారం నుంచి శనివారం వరకు గ్రేటర్ జోన్‌లో 800 బస్సులు మాత్రమే సిటీ ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. 70 శాతం సిటీబస్సులు జాతరకు తరలివెళ్లడంతో సిటీ ప్రయాణికులు ప్రత్యామ్నాయ ప్రయాణ మార్గాలు చూసుకోవాల్సి ఉంటుంది. మేడారం స్పెషల్ ఆపరేషన్స్‌కు బస్సులు వెళ్తుండడంతో సిటీ ప్రయాణికులు తమకు సహకరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.మేడారం జాతరను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఈనెల 19 నుంచి శనివారం వరకు ఆర్టీసీ 4 వందల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఎంజీబీఎస్, జూబ్లీ బస్‌స్టేషన్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

## మేడారం జాతర రోజుల్లో హైదరాబాదు నగరంలో తిరిగేవి తక్కువ బస్సులే!



హైదరాబాద్ నగరంలో తరుచూ మీరు బస్సుల్లో ప్రయాణిస్తుంటారా? లేదా ఈ నెల 24వ తేదీ వరకు బస్సుల్లో తిరిగే పనులు ఉన్నాయా? అయితే ఇది మీకోసమే! మేడారం జాతర పూర్తయ్యే వరకు కొన్ని పనులు వాయిదా వేసుకోవాల్సిందే! ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మేడారం జాతర సందర్భంగా నగరానికి చెందిన పలు ఆర్టీసీ బస్సులను మేడారంకు కేటాయించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2850 బస్సులు తిరుగుతున్నాయి. అయితే ఇందులో 2 వేల బస్సులను ఎల్లుండి నుంచి మేడారం జాతరకు కేటాయించారు. ఇప్పటికే కొన్ని బస్సులను కేటాయించగా.. మరికొన్నింటిని జాతర సమయంలో కేటాయిస్తున్నారు. నగరం నుంచి మేడారంకు కేటాయించే 2000 బస్సుల్లో 250 హైదరాబాద్ నగరం నుంచి మేడారం జాతరకు వెళ్లనుండగా.. మిగతావి ఇతర ప్రాంతాల నుంచి వెళతాయి. దీంతో 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నగరంలో బస్సుల్లో ప్రయాణించడం కష్టమే. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ పథకం కింద నగరంలో తిరిగే మహిళల సంఖ్య 18 లక్షల వరకు ఉంది. ఇలాంటి తరుణంలో మేడారం జాతరకు ఎక్కువ బస్సులు వెళుతున్నాయి. మేడారం జాతర రోజుల్లో నగరంలో 2850 బస్సులకు గాను కేవలం 850 మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. కాబట్టి ఈ రోజుల్లో ఎక్కువమంది ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

# సొంత జిల్లాలో బొత్సకు షాక్?

**విజయనగరం :** బొత్స అనుచరులే పార్టీలో ఇమడలేని పరిస్థితులు ఉంటే, ఎలా అంటూ చర్చజరుగుతోంది. ఓ విధంగా పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ పార్టీనివీడితే సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల కన్నా, మంత్రి బొత్సకే పెద్దమైనస్‌గా చెబుతున్నారు. అనుచరులను కాపాడుకోలేకపోయారనే అపప్రదను మంత్రిమూటగట్టు కోవాల్సి వస్తుందని అంటున్నారు.సొంత జిల్లాలో బొత్సకు షాక్?వైసీపీకి దూరమవుతున్న ప్రధాన అనుచరులు..రాష్ట్ర మంత్రి బొత్సకు సొంతజిల్లాలో ఎదురుదెబ్బలు తగులుతు న్నాయా? వైసీపీలో రాష్ట్ర స్థాయిలో చక్రంతిప్పుతున్న మంత్రి.. జిల్లాలో తన ముఖ్య అనుచరులనుకాపాడు కోలేకపోతున్నారా? రెండు దశాబ్దాలుగా మంత్రికి వీరవిధేయులుగాకొనసాగిన వారు.. ఇప్పుడు పార్టీకి గుడ్‌బై చెప్పడానికి కారణమేంటి? మంత్రిపట్టు తగ్గుతుందా? ఆయన ప్రత్యర్థుల బలం పెరుగుతుందా?విజయనగరం జిల్లారాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంవిజయనగరం రాజకీయం హాట్ హాట్‌గా మారుతుంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర మంత్రిబొత్సకు షాక్ తగిలేలా.. విజయనగరం ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్లచక్రం తిప్పడం హాట్‌టాపిక్ అవుతోంది. కోలగట్ల దెబ్బకు బొత్స అనుచరులుపార్టీలో ఇమడలేక.. టీడీపీ కండువా కప్పుకోడానికి సిద్ధమవడం విజయనగరంరాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది.విజయనగరం జిల్లాలో మంత్రిబొత్స కుటుంబానిదే ఆధిపత్యం. రాష్ట్ర స్థాయిలోనూ వైసీపీలో బొత్స మాటలకుఎదురులేదు. కానీ, ప్రస్తుతం రాజకీయం మారుతున్నట్లు కనిపిస్తోంది. బొత్సహవాకు బ్రేకులు పడేలా.. ఆయన అనుచరులకు చెక్ చెప్పేలా పార్టీలో మరో వర్గంబలోపేతమడం ఆసక్తికరంగా మారుతోంది. విజయనగరం పట్టణంలో బొత్స మార్క్‌లేకుండా చేయడానికి అన్నట్లు.. బొత్స ప్రధాన అనుచరులకు పార్టీ నుంచిపొమ్మని పొగబెట్టడం చూస్తుంటే.. జిల్లాలో బొత్సకు స్పీడ్‌కు బ్రేకులుపడుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విజయనగరం అసెంబ్లీని యోజకవర్గంలో మంత్రి బొత్స వర్గంగా చెప్పుకునే పిల్లా విజయ్‌కుమార్,అవనాపు విజయ్‌తోపాటు ఇతర ద్వితీయ శ్రేణి నాయకులు సుమారు 10వేల మందికార్యకర్తలతో సహా టీడీపీలోకి వెళ్లనున్నట్లు బహిరంగంగా ప్రకటించారు .విజయనగరం పట్టణంలో పిల్లా, అవనాపు కుటుంబాలకు భారీ అనుచర గణం ఉంది.బొత్సకు ప్రధాన అనుచరుడిగా పిల్లా విజయ్‌కుమార్‌కు ప్రత్యేక గుర్తింపుఉంది. ఇక అవనాపు విజయ్.. వైసీపీ పార్టీ ప్రారంభించిన తర్వాత జిల్లాలో ఆపార్టీ జెండా పట్టుకున్న తొలి నాయకుడు.మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్‌కోలగట్ల కూడా అవనాపు విజయ్ తర్వాతే పార్టీలోకి వచ్చారు. తొలి నుంచివిజయనగరం ఎమ్మెల్యే, మేయర్ పదవులపై ఆశలు పెట్టుకున్న అవనాపు సోదరులకు..పార్టీ అధికారంలోకి వచ్చాక మింగుడు పడని పరిస్థితులు ఏర్పాడ్డాయి. పిల్లావిజయ్‌కుమార్ కూడా నగరంలో పట్టు కోసం ఎంతగానో ప్రయత్నించారు. కానీ, 2019ఎన్నికల తర్వాత సీన్ మారిపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా కోలగట్లఆధిపత్యం ముందు వీరిద్దరూ తేలిపోయారు. కోలగట్ల అధికారం ముందు నిలబడలేని ఈఇద్దరు బొత్స అండదండల కోసం ప్రయత్నించినా.. వర్క్ అవుట్ కాలేదు.పార్టీలో కోలగట్ల మాటే చెల్లుబాటయ్యే పరిస్థితులు ఏర్పడటంతో పిల్లావిజయ్‌కుమార్, అవనాపు విజయ్‌లు మేయర్ కాదుకదా, కనీసం కార్పొరేటర్లుగాకూడా ఎన్నిక కాలేకపోయారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వంత్రంగాపోటీ చేద్దామని భావించినా, బొత్స హామీతో వెనక్కుతగ్గారు. కానీ, ఆ ఎన్నికలతర్వాత వీరి పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని చెబుతున్నారు. తన మాటనుధిక్కరించారనే కారణంతో కోలగట్ల మరింత ఇబ్బందులకు గురిచేయడంతో అధికారపార్టీలో ఉన్నా, ఎలాంటి గుర్తింపు లేక అసంతృప్తితోనే ఇన్నాళ్లు గడిపారు.ఇక ఎన్నికలు దగ్గరపడటంతో తమ సత్తా ఏంటో చూపుతామంటూ సవాల్ చేస్తున్నారు.ఏకంగా నగరంలో తమ ప్రధాన అనుచరులను పోగేసి 50 వార్డుల్లో 10 వేల మందితోటీడీపీలో చేరుతున్నామంటూ అల్టిమేటం జారీ చేశారు.పిల్లా విజయ్‌కుమార్,అవనాపు విజయ్ వంటివారు ద్వితీయ శ్రేణి నాయకులైనా.. బొత్స ప్రధానఅనుచరులు కావడంతో వారు పార్టీ వీడుతున్నారనేటాక్.. జిల్లాలో విస్తృతచర్చకు దారితీసింది. బొత్స అనుచరులే పార్టీలో ఇమడలేని పరిస్థితులు ఉంటే,ఎలా అంటూ చర్చ జరుగుతోంది. ఓ విధంగా పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్‌పార్టీని వీడితే సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల కన్నా, మంత్రి బొత్సకేపెద్ద మైనస్‌గా చెబుతున్నారు. అనుచరులను కాపాడుకోలేకపోయారనే అపప్రదనుమంత్రి మూటగట్టుకో వాల్సి వస్తుందని అంటున్నారు.ఇక ఈ ఎపిసోడ్‌తో జిల్లాలోటీడీపీకి.. సీనియర్ నేత అశోక్ గజపతికి ఊపు వచ్చినట్లు కనిపిస్తోంది. గతఎన్నికల్లో అశోక్ కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం నుంచి పోటీ చేసిఓడిపోయారు. ఈసారి మళ్లీ అదితి పోటీ చేయనున్నారు. ఇప్పటికే విస్తృతంగాప్రచార కార్యక్రమాలు చేస్తున్నారు. ఇద్దరూ బలమైన బీసీ నేతలు ఆమెకుచేదోడుగా నిలవనుండటం శు భ సూచకంగా భావిస్తున్నారు టీడీపీ నేతలు.

## గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ

గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సోమవారం టీఎస్‌పీఎస్సీ వెబ్ నోట్ ఇచ్చింది. 2022 ఏప్రిల్ నెలలో 503 పోస్టులతో గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే పేపర్ లీకేజీ కారణంగా కమిషన్ ఒకసారి ప్రిలిమ్స్‌ను రద్దు చేసింది. రెండోసారి నిర్వహించిన ప్రిలిమ్స్‌ను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. సరైన నిబంధనలు పాటించలేదంటూ హైకోర్టు రెండోసారి ప్రిలిమ్స్‌ను రద్దు చేసింది. అదే సమయంలో ఇటీవల మరో 60 గ్రూప్ 1 పోస్టులకు ప్రభుత్వం అంగీకరించింది. పాత 503, కొత్త 60 పోస్టులు... మొత్తం 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చేందుకు కమిషన్ యోచిస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది.

## త్వరలో ఢిల్లీకి కెసిఆర్..

-మొదటి పేజి తరువాయి




ఎప్పుడైనా పొత్తుల గురించి ఊసెత్తమా? బండి సంజయ్ లక్ష్మణ్ కిషన్ రెడ్డి ఎందుకు ఎగిరి పడుతున్నారు? బీఆర్ఎస్ ఒక సెక్యులర్ పార్టీ, మా నాయకుడు కెసిఆర్ ఒక సెక్యులర్ నాయకుడు. ఇలాంటి వార్తలకు లీకులు ఇచ్చేది బీజేపీనే. అలాగే వార్తలు రాయించేది బీజేపీ." అన్నారు బాల్క సుమన్.

**పొత్తు ఊహాగానాలకు అవకాశమిచ్చిందెవరు?**

సాధారణంగా బీఆర్ఎస్, బీజేపీ నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటుంటాయి. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి బీఆర్ఎస్, బీజేపీలపై కాంగ్రెస్ విమర్శలు చేసింది. దానికి కొనసాగింపుగా.. మాజీ మంత్రి మల్లారెడ్డి ఇటీవల మీడియా ప్రతినిధులతో మాట్లాడాడు. అలాగే ఎంపీ బండి సంజయ్ కూడా ఇదే అంశంపై ప్రకటన చేశాడు.

**ఇటీవల మల్లారెడ్డి ఏమన్నాడంటే..**

బీజేపీతో %దీ=సా%కు పొత్తు ఉండే అవకాశం ఉంది, మా ఎమ్మెల్యేలు ఎవరూ పార్టీ మారే ప్రసక్తే లేదు, అసలు మా ఎమ్మెల్యేలు ఎవరూ బీజేపీతో టచ్‌లోనే లేరు, రెండు పార్టీలు పొత్తుతో పోటీ చేస్తే.. %దీ=సా%కు మల్కాజ్ గిరి సీటు ఇస్తారు. %దీబీూ%తో %దీ=సా% పొత్తు ఉండే అవకాశమున్నప్పుడు.. మా ఎమ్మెల్యేలు టచ్ లో వున్నారని బండి సంజయ్ ఎలా మాట్లాడతారు? బండి సంజయ్‌తో అయ్యేది లేదు...పొయ్యేది లేదు" అన్నారు మల్లారెడ్డి.

**మల్లారెడ్డి మాటలకు నేపథ్యమేంటీ?**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలుపై మల్లారెడ్డి మాట్లాడారు. బండి సంజయ్ ఏమన్నాడంటే.. "ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఐదుగురు %దీ=సా% సిట్టింగ్ ఎంపీలు మాతో టచ్‌లో ఉన్నారు. అయినా లోక్‌సభ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు" అని స్పష్టం చేశారు. "బీఆర్ఎస్‌తో మాకు పొత్తు లేదు. కేసీఆర్ డ్రామా ఆడుతున్నారు. అవినీతి పార్టీలతో పొత్తు పెట్టుకునే పరిస్థితి లేదు. అధికారంలో ఉన్నప్పుడే %చీణూ%లో బీఆర్ఎస్‌ను చేర్చుకోలేదు. ఎటుకాని %దీ=సా% పార్టీని ఇప్పుడు ఎందుకు చేర్చుకుంటాం.? ప్రస్తుతమున్న బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు పక్క దారులు చూసుకుంటున్నారు. పొత్తులు అనేది కేసీఆర్ సృష్టి" అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు.

## బీజేపీ విజయ సంకల్ప రథయాత్ర



-మొదటి పేజి తరువాయి

, మల్కాజ్‌గిరి హైదరాబాద్ , సికింద్రాబాద్ కవర్ చేస్తూ.. యాత్ర కొనసాగనుంది కృష్ణ విజయ సంకల్ప యాత్ర మక్తల్ లో కృష్ణ గ్రామం నుంచి ప్రారంభం కానుంది. మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, నల్గొండ కవర్ చేస్తూయాత్ర కొనసాగనుంది. కొమరం భీం యాత్రనుఅస్సాం సీఎం హేమంత్ బిస్వా శర్మ ప్రారంభిస్తారు. రాజరాజేశ్వరీ యాత్ర తాండూర్‌లో ప్రారంభం కానుంది. దీనికి కేంద్రమంత్రి బీఎల్ వర్మ హాజరుకానున్నారు. భాగ్యలక్ష్మీ యాత్రకి గోవా సీఎం ప్రమోద సావంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కృష్ణ యాత్రకు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల హాజరవుతారు. యాత్రలో రోడ్ షో లు ఎక్కువ ఉంటాయి. ఐదు యాత్రలు కలిపి 5500 కి.మీలు కవర్ కానుంది. 114 అసెంబ్లీ కవర్ అయ్యేలా కవర్ యాత్ర ఉండనుంది. 106 రోడ్ షో లు ఉండనున్నాయి' అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## రానున్న రోజుల్లో డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేస్తాం



రానున్న రోజుల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో నేడు ఆయన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలనూ తాము అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అధికారంలోకి వచ్చామని, రానున్న రోజుల్లో కేంద్రంలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ, శివాజీల ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆరువేల బస్సులు కేటాయించినట్లు చెప్పారు. అందుకే గ్రామాలలో ఈ నెల 25వ తేదీ వరకు బస్సుల కొరత ఉంటుందని తెలిపారు. తాను లోక్ సభ సభ్యుడిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి నేటికీ కనిపిస్తోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు.

## సంపాదకీయం

# అన్నదాతల దేశద్రోహులా?

రైతులు మరోసారి తమ డిమాండ్లకు దేశ రాజధాని పరిసరాల్లో వీధుల్లోకి రావలసి వచ్చింది. వారి డిమాండ్ల మంచిచెడులను అటుంచితే, ఈ సందర్భంగా రైతుల గురించి ముఖ్యంగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విషప్రచారం కొనసాగుతూ ఉండటం దురదృష్టకరం. ఒకప్పుడు దేశానికి అన్నం పెట్టే రైతులను 'జై కిసాన్' అంటూ హీరోలుగా చూసిన దేశంలో నేడు ఖలిస్తాన్ మద్దతుదారులుగా చిత్రీకరించే దుస్థితికి దిగజారడానికి మించిన దేశద్రోహం మరొకటి ఉండదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన వివాదాస్పదమైన మూడు రైతు చట్టాల పట్ల చెలరేగిన రైతుల ఆగ్రహ జ్వాలలు సుమారు సంవత్సరం పాటు తీవ్ర నిరసనలకు దారితీయగా, స్వయంగా ప్రధాన మంత్రి జోక్యం చేసుకొని, ఆ చట్టాలను ఉపసంహరించుకొంటున్నట్టు పార్లమెంట్ లో ప్రకటించడంతో ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ గత మూడేళ్లలో ఆ దిశలో ఎటువంటి ప్రయత్నం జరగకపోవడంతో రైతులు అసహనానికి గురవుతున్నారు. తిరిగి ఇప్పుడు 'చలో ఢిల్లీ' పేరుతో రైతులు ఉద్యమిస్తున్నారు. ఇప్పుడు రైతులు కొత్తగా ప్రభుత్వం ముందుకు ఈ డిమాండ్లు తీసుకురావడం లేదు. ఎన్నికల ముందు ప్రతిపక్షాలు వీరిని రెచ్చగొడుతున్నాయంటూ బాధ్యతా రహితంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజంగా ప్రతిపక్షాలకు అంతటి బలం ఉంటే ఎన్నికల్లోనే తమ ప్రతాపం చూపే ప్రయత్నం చేసేవి గదా! చివరకు కనీసం మద్దతు ధర గురించి కేంద్ర ప్రభుత్వం నియమించిన 'నిపుణుల కమిటీ' సభ్యుడు ఒకరు ఒక టివి చర్చలో ఉద్యమిస్తున్న రైతులను 'దేశద్రోహులు' అని పేర్కొన్నారంటే 'రైతు వ్యతిరేక' వ్యక్తులు లేదా రైతుల సమస్యలపట్ల కనీసం అవగాహనలేని వ్యక్తులు నేడు కీలక స్థలం లో ఉండటంతో పరిస్థితులను అర్థం చేసుకోలేకపోతున్నారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రధాని పదవిలో ఉన్నవారిలో కేవలం ఇద్దరు మాత్రమే నిజమైన రైతులు లేదా వారి ప్రతినిధులు ఉన్నారని చెప్పవచ్చు. వారిలో అగ్రనేత చరణ్ సింగ్. ఆయన ప్రధానిగా పార్లమెంట్ ముఖం చూడకుండానే రాజీనామా చేశారు. ఆ తర్వాత హెచ్‌డి దేవెగౌడ 11 నెలలకు మించి పదవిలో ఉండలేకపోయారు. మిగిలిన ప్రధానులు ఎవ్వరికీ రైతుల సమస్యలపట్ల సరైన అవగాహన లేకపోవడంతోనే వారిసమస్యలను కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల దృష్టిలో చూస్తున్నారు. అయితే, ఇందిరా గాంధీ ప్రధాని పదవి చేపట్టగానే మొదటి సారిగా అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు 'ఓ భిక్ష పాత్రతో భారత్ ప్రధాని అమెరికాకు వచ్చారు' అని అక్కడి మీడియా పతాక శీర్షికతో వార్తలు రాయడంతో ఆమె అవమానంగా భావించారు. వెంటనే భారత్‌లో ఆహారోత్పత్తులు పెంచాలని దృఢమైన నిర్ణయం తీసుకొని, ఆహార విప్లవంను పట్టుదలతో సాధించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి వంగడాలు రూపొందించడంలో ఆమెకు బాసటగా ఎంఎస్ స్వామినాథన్ నిలిచారు. ఈ మధ్య ప్రధాని మోడీ దేశ అభివృద్ధికి నాలుగు 'కులాలు' తనకు ప్రధానం అంటూ యువత, మహిళలు, పేదలు, రైతులు అని చెప్పడం ద్వారా రైతుల అభ్యున్నతే తన ప్రాధాన్యతగా వెల్లడించారు. అయితే 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రకటించిన ప్రధాని ఇప్పుడా విషయం గురించి మాట్లాడటం లేదు. మరోవంక, తన ప్రభుత్వం పట్ల రైతులు ఆగ్రహంతో ఉన్నారని గ్రహించి ఎన్నికలముందు హడావుడిగా చరణ్ సింగ్, స్వామినాథన్‌లకు 'భారత్ రత్న' లను ప్రకటించారు. కానీ రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని రైతులలో ఇప్పటికీ విశేషమైన ప్రభావం గల చరణ్ సింగ్‌కు 'భారత్ రత్న' ప్రకటించడంతో పార్లమెంట్‌కు సొంతంగా ఎన్నిక కాలేక ఇబ్బందిపడుతున్న ఆయన మనుమడు జయంత్ చౌదరి 'ఇండియా' కూటమి నుండి నిష్క్రమించి 'ఎన్‌డిఎ' కూటమిలో చేరుతున్నట్లు ప్రకటించారు. తద్వారా బిజెపి రాజకీయంగా లోక్‌సభ ఎన్నికలలో ప్రయోజనం పొందే అవకాశం ఉంది. అయితే, కనీస మద్దతు ధరతో పాటు ఇతర డిమాండ్లపై ఇప్పటికి మూడు సార్లు కేంద్ర మంత్రులతో రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయింది. తమ డిమాండ్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు దేశసరిహద్దులను మూసివేస్తూ కంచెలు వస్తున్నట్లుగా ఢిల్లీ చుట్టూ తీవ్రమైన నిర్బంధాలకు దిగుతున్నారు. భారీ ఎత్తున భద్రతా దళాలను మోహరింపచేసి రైతులు కదలకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. 2020లో రైతుల మధ్య చీలికలు తీసుకొచ్చి, వారిలో ఖలిస్థాన్ ఉగ్రవాదులు చేరిపోయారంటూ ప్రచారం చేస్తూ ఉద్యమాన్ని అణచివేయడం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. దాంతో ఇప్పుడు ముందుగానే ప్రభుత్వం అప్రమత్తమై రైతులు అసలు ఢిల్లీకి రాకుండా కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం మద్దతు ధరను చట్టబద్ధం చేస్తే ఆహార ద్రవ్యోల్బణం పెద్ద ఎత్తున పెరుగుతుందని, ప్రభుత్వంపై రూ. 10 లక్షల కోట్లమేరకు అదనపు వ్యయం అవుతుందని నిరాధారమైన కథనాలు నేడు మీడియాలో వ్యాపిస్తున్నాయి. భారత్ ను 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెబుతున్న ప్రధాని మోడీ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయకుండా సాధింపగలరా? 'సబ్ కా సాత్ %ా% సబ్ కా వికాస్' తన లక్ష్యంగా ప్రధాని చెబుతున్నారు. దేశ జనాభాలో సగం మంది, అంటే 70 కోట్ల మందికి ఇంకా వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయ కుటుంబాల గురించిన తాజా సర్వే ప్రకారం ఒక్కో కుటుంబం సగటు వార్షిక ఆదాయం రూ. 10,218 మాత్రమే. వారి వ్యవసాయేతర ఆదాయాలను పరిగణనలోకి తీసుకొని పక్షంలో రోజువారీ ఆదాయం రూ. 27 మాత్రమే. అంటే, దేశంలో అత్యంత పేదవారు రైతులే అని గ్రహించాలి. ప్రభుత్వం 23 పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తుంది. వాటిల్లో కేవలం బియ్యం, గోధుమలు మాత్రమే నియంత్రిత మార్కెట్లు ఉన్నాయి. పత్తి, చెరకు, పప్పుధాన్యాలు పాక్షికంగా కొన్ని రాష్ట్రాలలో ఉన్నాయి. కేవలం 14% మంది రైతులకు మాత్రమే మద్దతు ధర లభిస్తున్నట్లు ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇటీవల తెలిపింది. అంటే 86% మంది రైతులు మార్కెట్ దయాదాక్షిణ్యాలపై, పరోక్షంగా కమిషన్ ఏజెంట్‌పై ఆధారపడి ఉన్నారు. ఈ వ్యవస్థ తమకు లాభదాయకంగా ఉంటే నేడు రైతులు వీధులలోకి రావాల్సి వచ్చి ఉండెడిదికాదు. భారత ప్రభుత్వం 'భారత రత్న' ప్రకటించిన స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అనుసరించే మద్దతు ధరను చట్టబద్ధంగా అందించమని కోరుతున్నాను. ఆ విధంగా చేయడంతో ప్రభుత్వం చెబుతున్న మద్దతు ధర అందుబాటులో లేని 86% మంది రైతుల ఆదాయం పెరుగుదలకు దారితీస్తుంది. నేడు చాలామంది వితండవాదన చేస్తున్నట్లు రైతుల ఆదాయం పెరగడం ప్రభుత్వానికి భారం కాబోదు. దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు, అత్యంత బలీయంగా మారేందుకు దారితీస్తుంది. రైతుల కొనుగోలుశక్తి పెరిగితే అన్ని వ్యాపార రంగాలు పుంజుకుంటాయి. కేవలం జనాభాలో 4 లేదా 5 శాతంగా ఉన్న ఉద్యోగుల జీతాలను 7వ వేతన సంఘం గణనీయంగా పెంచితే వారి కొనుగోలు శక్తి పెరిగి ఆర్థికాభివృద్ధికి దారి తీస్తున్నట్లు సంబరపడిపోయాము. దేశ జనాభాలో 50 శాతంగా ఉన్న రైతుల కొనుగోలు శక్తి మద్దతు ధర కారణంగా పెద్ద ఎత్తున పెరిగితే దేశ ఆర్థికాభివృద్ధి ఊహించనంత వేగవంతం కాగలదని గ్రహించాలి. మద్దతు ధరను చట్టబద్ధం చేయడంతో మన ఆర్థిక వ్యవస్థపై ఉండే సానుకూల ప్రభావాన్ని గుర్తించకుండా, ప్రభుత్వంలోని పెద్దలు, ఆర్థిక నిపుణులు, మీడియా మార్కెట్‌లపై ఎక్కువగా విశ్వాసం వ్యక్తం చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. లోపభూయిష్టమైన మార్కెట్ ల కారణంగానే దశాబ్దాలుగా మన రైతులు ప్రపంచంలో మరే దేశంలో కనీవినీ ఎరుగనంతటి దోపిడీకి గురవుతున్నారని మరచిపోతున్నారు. రైతుల నిరసనలు కేవలం భారత్‌కు మాత్రమే పరిమితం కావని గ్రహించాలి. జనవరిలో 17 ఐరోపా దేశాల్లో రైతుల నిరసనలు కొనసాగాయి.ఇంకా స్పెయిన్, పోలాండ్, ఇటలీ వంటి దేశాలలో కొనసాగుతున్నాయి. వారి ప్రధాన డిమాండ్ కూడా వ్యవసాయ ఉత్పత్తులకు నిర్దుష్టమైన ధర కల్పించడమే. అయితే, ఐరోపా దేశాల్లో మాదిరిగా భారత రైతులు ప్రభుత్వమే తమ ఉత్పత్తులు అన్నింటిని కొనుగోలు చేయమని కోరడం లేదు. మార్కెట్‌లలో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు నిర్దుష్టమైన సూచికగా ఒక ధరను చట్టబద్ధంగా నిర్ణయించమని కోరుతున్నారు.

# స్వరాజ్య సంస్థాపకుడు శివాజీ



ధర్మ ప్రతిష్ఠాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది.

1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామా యణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝా గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాఫా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి- తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది.

1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నే ళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోండ్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగ రాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయ లేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

# తొలి మహిళా కార్టూనిస్టు

రాగతి పండరి పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చేవి నవ్వు తెప్పించే కార్టూన్లే. ఆమె పేరు తెలియని సాహి త్య అభిమానులు ఉండరం టే అతిశయోక్తి కాదేమో. వ్యంగ్య చిత్రాలతో నవ్వించాలనే లక్ష్యంతో అన్ని అడ్డంకులను అధిగమించి జీవిత ఆశయం నెరవేరుకున్న అపురూప కళాకారిణి. సామాజిక అంశాలను ప్రతిబింబించే కార్టూన్లు గీస్తూ మన్ననలు, పురస్కారాలూ అందుకున్న కార్టూనిస్టు రాగతి పండరి. విధి వంచితయై, నాలుగ డుగులు వేసి చుట్టూ ఉన్న ప్రపం చంలో స్వేచ్ఛగా తిరిగే భాగ్యానికి నోచుకోక పోయినా అన్నింటిని అవగాహన చేసుకొని హాస్యంలో రంగరించి లక్ష్యాన్ని చేరుకున్న ఘనత, అసమాన ప్రతిభ ఆమెకే సొంతం. రాగతి పండరి (జూలై 22, 1965 - 19 ఫిబ్రవరి, 2015) తెలుగు వ్యం గ్య చిత్రకారులలో రాశి లోనూ, వాసి లోనూ సమానమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టు. అంతే కాదు, అనతి కాలంలోనే తెలుగు వ్యంగ్య చిత్ర కళా రంగంలో ఎనలేని పేరు తెచ్చుకుని, ఆ రంగంలో అగ్రగణ్యు లైన బాపు, జయదేవ్ ల సరసన నిలబడ గలిగిన స్థాయి చేరుకున్న గొప్పతనం ఆమెది. ఆ గొప్పతనం వెనక అకుంఠిత దీక్ష, అంకిత భావంతో కృషి, వ్యంగ్య చిత్ర కళ మీద ఎనలేని ప్రేమ, నిరంతర పరిశ్రమ ఉన్నాయి. దురదృష్ట వశాత్తూ, ఆమెకు చిన్నతంలో వచ్చిన పోలియో మూలంగా శారీర కంగా బలహీను రాలైనా, ఆ బలహీ నతను అధిగమించి, మానసిక ఒత్తి డిని అతిక్రమించి, తనకు ఇష్టమైన కళకే అంకితమై, కార్టూన్లు గీసి అందరి మన్ననలు పొందారు. ఆమె కార్టూనులో ఏ మూల వెదికినా తేట తెలుగు దనమే, ఏ చోట స్పృశిం చినా తేనెల తెలుగు మాటలే దర్శనం ఇస్తాయి. పండగలు, పబ్బా లు, అల్లుళ్ళు, ఆడ పడుచులు, దొంగలు, పోలీసులు, ఆఫీసులు, పార్కులూ, ఆమె తాకని విషయం లేదు, లాగని తీగ లేదు, నడవని డొంక లేదు. తెలుగు వ్యంగ్య చిత్ర రంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారా వాహికలు వార పత్రికలలో నిర్వ హించిన ఘనత ఆమెదే. పన్నెండు వేలకు పైగా కార్టూన్లు వేసిన ఏకైక మహిళగా ఆమె గుర్తింపు పొందారు. రాగతి పండరి 1965 సంవత్సరం జూలై 22 న విశాఖ పట్టణంలో రాగతి గోవిందరావు, శాంతకుమారి దంపతులకు జన్మించారు. చదువు ఇంటి వద్దనే కొనసాగింది.



అతి చిన్న వయసులోనే పోలియో వచ్చి, శారీరక లోపం ఏర్పడినా, పట్టు దల, ధైర్యం కలిగి జీవితాన్ని ఆత్మ విశ్వాసంతో, కఠోర పరిశ్రమతో ఎదుర్కొని, కార్టూన్ రంగంలో అగ్ర గణ్యుల సరసన చేరారు. ఆమె తన వ్యంగ్య చిత్ర ప్రస్థానాన్ని 1973లో తన 8వ ఏటనే మొదలు పెట్టారు. బాల్యంలోనే వ్యంగ్య చిత్రాలు ప్రచురణ ప్రారంభ మయ్యింది. 1980-1990 దశకాల మధ్య కొన్ని వేల వ్యంగ్య చిత్రాలను శరపరం పరగా చిత్రించారు. పాఠకుల మనసులను దోచుకున్నారు. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలో ఈమె కార్టూన్లు ప్రచురించ బడ్డా యి. పండుగల సందర్భాలలో పత్రికల సంపాదకులు ఆమె కార్టూన్లను కోరుకుని, అడిగి తెప్పించుకుని తమతమ పత్రికలలో ప్రచురించేవారు. రాగతి పండరి ఆలోచన వచ్చిందే తడవుగా కాగితంపై పెన్సిల్‌తో గీతలు కూడా గీసు కోకుండా నేరు గా స్కెచ్ పెన్నుతోనే కార్టూన్ వేసే వారు. ఆ క్రమంలో ఐదు పది నిమి షాల స్వల్ప వ్యవధి లోనే కార్టూన్ గీసే విభిన్నమైన శైలి ఆమెది. జయదేవ్ గురువుగా భావించి ఆయన శైలిలో కొద్దిరోజుల పాటు కార్టూన్లు వేసినా, వేగంగా తనదం టూ ఓ ప్రత్యేకమైన శైలిని ఏర్పరు చుకుని ఆమె గీత చూడగానే గుర్తుపట్టేలా శైలిని ఏర్పరుచు కున్నారు.

రాగతి పండరి కార్టూన్లలో ఆడవారిని గయ్యాళి భార్య గానో, అత్త గానో మాత్రమే కాకుండా, అనేక ఇతర పాత్రలను, సృష్టించి, చూపించారు. కుదురైన చక్కటి చిత్రీకరణ, గుండ్రటి చేతివ్రాత, తేట తెలుగులో సంభాషణలు ఆమె వ్యంగ్య చిత్రాల ప్రత్యేకత. తెలుగు వ్యంగ్య చిత్రరంగంలో అనేక వ్యంగ్య చిత్ర ధారావాహికలు వార పత్రికల లో నిర్వహించిన ఘనత ఆమెది. సమకాలీన వ్యంగ్య చిత్రాకారు లలో, వార్తా పత్రికలలో పనిచేస్తూ ఉన్న కార్టూనిస్ట్‌లను మినహాయిస్తే, రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేసే ఏకైక ఫ్రీలాన్స్ కార్టూనిస్టు ఆమె. 'రాజకీయ చెదరంగం' అన్న పేరుతో ఒక దశాబ్దం పైగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురించబడటం తనకెంతో ఆనందం కలిగించిందని ఆమె చెపుతుండే వారు. ఆమె వ్యంగ్య చిత్రాలు హాస్యం ప్రధానం గా, ఆకర్షణీయంగా ఉండి, మానవ ప్రవృత్తిలో ఉన్న ద్వంద్వ అలోచానా విధానం, సాఘిక దురాచారాల పట్ల విమర్శల తో కూడి పాఠకులను నవ్వులలో ముంచెత్తటమే కాకుం డా, ఆలోచించటానికి కూడా ఉద్యు క్తులను చేస్తాయి.

2001 సంవత్సరం ఉగాది పురస్కారం ఆంధ్ర ప్రదేశ్ అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. రాగతి పండరి కార్టూన్ సామ్రా జ్యాన్ని మొత్తం తన కైవసం చేసుకు న్న ఏకైక మహిళ కార్టూనిస్టుగా పేరు ప్రఖ్యాతుల నార్జించారని ఆమె గురు తుల్యులు కార్టూనిస్టు జయ దేవ్, వ్యాఖ్యానించారు. కాలక్రమే ణా, తనకంటూ స్వంత శైలి ఏర్పరుచుకుని, చాలామంది మగ తెలుగు కార్టూనిస్టులు, వృత్తి పరంగా అసూయ పడేలా దూసుకు వచ్చిన ఒకే ఒక మహిళా కార్టూని స్టుగా కార్టూనిస్టు రామకృష్ణ అభివ ర్ణించారు. కార్టూన్ల సాధనలో మొదట్లో తాను గీసిన చిత్రాలను చెన్నైలో నివసించే కార్టూనిస్టు జయదేవ్‌కు పండరి పంపితే మెచ్చు కోవడమే కాకుండా, ఆయన జవాబు రాస్తూ, కార్టూన్లను అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. స్వయంగా విశాఖపట్నం వచ్చి తన శిష్యురాలిని అభినందిం చారు.. బాపు అంతటి గొప్ప చిత్రకారుడు రచన మాస పత్రికలో 2005లో ప్రచురించిన వినాయక చవితి కార్టూన్ మెచ్చుకొంటూ లేఖ రాసి, పండరి కార్టూన్‌కు బాపు బొమ్మ గీయడం విశేషం. 2015 ఫిబ్రవరి 19 న విశాఖ పట్టణంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధితో కన్ను మూశారు. ఆమె కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు ఆమె అవయ వాలను సావిత్రిబాయి పూలే మెమోరియల్ ట్రస్ట్ ద్వారా దానం చేశారు.

# విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలి



**వాస్తవ నేస్తం,కోదాడ:** విద్యార్థులు బాల్యం నుంచి విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవబత్తిని నాగార్జున తెలిపారు. సోమవారం కోదాడ పట్టణానికి చెందిన న్యాయవాది తూములూరి సీతారామరాజు, మంజుల దంపతుల కుమారుడు ఎన్.సీ.సీ విద్యార్థి హర్షిత్ సాయి గత నెలలో రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో జరిగిన పరేడ్ లో ప్రధానమంత్రి, రాష్ట్రపతి కి గాడ్ ఆఫ్ హానర్ గా పాల్గొన్న సందర్భంగా కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా నుండి ఏకైక విద్యార్థిగా హర్షిత్ సాయి పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం నిరంతర కృషి చేసి తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న కన్న కలలను నిజం చేయాలి అన్నారు. బాల్యం నుంచే విద్యతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ కోదాడకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గాలి, శ్రీనివాస్ నాయుడు, సెక్రటరీ శరత్ బాబు,జాయింట్ సెక్రటరీ సీతారామరాజు, సీనియర్ న్యాయవాదులు సుధాకర్ రెడ్డి, వెంకట్రావు, పాలేటి నాగేశ్వరరావు, కోటిరెడ్డి, సిలివేరు వెంకటేశ్వర్లు, ఈదుల కృష్ణయ్య, తమ్మినేని హనుమంతరావు, చలం తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం





**వేలాదిగా తరలివచ్చి భక్తులు**


**వాస్తవ నేస్తం,వైరా:** పట్టణంలో సోమవారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట కన్నుల పండుగగా జరిగింది. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల మండలాలు గ్రామాల నుండి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని స్వామి తీర్థ ప్రసాదం స్వీకరించి స్వామి కృపకు పాత్రులయ్యారు. స్వస్తిశ్రీ చాంద్రమానేన శోభాకృత నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి ఉదయం మృగశిర నక్షత్ర యుక్త మేష లగ్నం పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఉష్ణ వాహన శిలా ఆలయ శిఖరం విజయ్ శితల మహా చక్ర బొడ్రాయి ముత్యాలమ్మ నవగ్రహాలు ప్రతిష్టించారు. ప్రతిష్టలను బ్రహ్మశ్రీ ఇంగువ రాజేశ్వర శర్మ సిద్ధాంతి ఆచరత్వమున బ్రాహ్మణోత్తములచే జరిపించారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమంను శాసనసభ్యులు రాందాస్ నాయక్ నాయక్ ప్రారంభించారు. మహా అన్నప్రసాద కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చింత నిప్పు మురలీధర్ రావు, కొల్లి వెంకటేశ్వరావు, కొల్లి నాగేశ్వరరావు, కొల్లి రమేష్, దొంతబోయిన వెంకటేశ్వర్లు, హరికృష్ణ, తదితరులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ



**వాస్తవ నేస్తం,కోటగిరి:** ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాని ఆవిష్కరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చత్రపతి శివాజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. శివాజీ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని కెపిహెచ్బి ఫిఫ్త్ ఫేజ్ జనసేన పార్టీ ఆఫీస్లో కూకట్పల్లి నియోజక వర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మా రెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ మరాఠా యోధుడు భవాని మాత చేత వీర ఖడ్గం పొంది నా గమ్యం, నా గమనం, హిందుత్వం అని నినదించిన వాడు మొగల్ సామ్రాజ్యాన్ని ఎదురించి ఛత్రపతి శివాజీ గా పేరుకెక్కినాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ అని, శివాజీకి మహిళల పట్ల అపారమైన గౌరవం ఉండేది అని, విదేశీ బానిసత్వం నుండి హిందూ జాతిని రక్షించే నాయకుడు ఒక్క శివాజీనే అని దేశ ప్రజలందరూ గుర్తించారు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## షాప్ ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్



**వాస్తవ నేస్తం,కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ 4వ డివిజన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టీ టైం షాప్ ను నేడు డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్పొరేటర్ చిట్ల దివాకర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ మేయర్ కార్పొరేటర్, నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాల వెంగయ్య చౌదరి, నాయకులు సాంబశివరెడ్డి, కుమార్ రెడ్డి, దశరథ్, యజమానులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** ఛత్రపతి శివాజీ మహారాజ్ 394 జయంతి సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం లోని మూసాపెట్ డివిజన్ లోని జనతా నగర్ లో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నేడు శేరిలింగంపల్లి నియోజకవర్గం నియోజక వర్గంలోని కూకట్పల్లి డివిజన్ పరిధిలోని దీన బంధు కాలనీ లలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరతమాత ముద్దుబిడ్డ, స్త్రీని గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు ఛత్రపతి శివాజీ అని తెలియజేసారు.

## నూతన ఎంవీఐగా బాధ్యతలు చేపట్టిన వరప్రసాద్



**వాస్తవ నేస్తం,వైరా:** నూతన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా వరప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే ఇక్కడ విధులు నిర్వహించిన శంకర్ నాయక్ బదిలీపై ఆసిఫాబాద్ వెళ్లగా, ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. వాహనాలకు అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు.

## బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ




**వాస్తవ నేస్తం,బైంసా:** పట్టణానికి మంగళవారం అస్సాం సీఎం రాక, విజయ సంకల్ప యాత్రలో భాగంగా బహిరంగ సభ స్థలాన్ని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాట్లను ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. అస్సాం సీఎం హేమంత బిశ్వశర్మకు హై సెక్యూరిటీ బందోబస్తు నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపడుతుంది. గత రెండు రోజుల నుండి అస్సాం సీఎం సెక్యూరిటీ ఎస్పి, ఏఎస్పీలు బైంసాలోనే మఖం వేసి బందోబస్తును పరిశీలిస్తున్నారు. సీఎం సభాస్థలిని మధ్యాహ్న భోజన ఏర్పాట్ల విషయమై బీజేపీ నాయకులతో అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఏఎస్పి కాంతిలాల్ పాటిల్, బైంసా సీఐ రాజారెడ్డి, తో పాటు పలువురు ఉన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ల్యాప్టాప్ అందజేత



**వాస్తవ నేస్తం,వైరా:** పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి వారి ఉన్నతికి చేయూతను అందించామని వైస్ డిస్టిక్ గవర్నర్ నంబూరు మధుసూదన్ రావు అన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్నత చదువులు చదువుతున్న వారికి ఎల్లవేళలా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదుకుంటామని అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమెరికాలో ఉంటూ స్వదేశంలో విద్యార్థుల కోసం సహాయాన్ని అందించాలని ఉద్దేశంతో డాక్టర్ సుమలత దంపతుల దాతృత్వంతో నంబూరు మధుసూదన్ రావు ప్రోత్సాహంతో ఇంజనీరింగ్ చదువుకునే వైరా కు చెందిన బాజీబాబా అనే విద్యార్థి కి లాప్టాప్ అందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వర్రావు, కోదండ రామాలయం చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, కొల్ల రాంబాబు, పోలా శ్రీనివాసరావు, కట్ల సురేష్, తాడికొండ రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో పాల్గొన్న పులి మామిడి రాజు



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట పట్టణంలోని పిఎస్ యంఎల్ కాలనీ లో శివాజీ యూత్ వారు ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ 394 వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని శివాజీ మహారాజ్ కు పూజాకార్యక్రమం నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ ముందుగా సదాశివపేట పట్టణ మరియు మండల మరియు సంగారెడ్డి జిల్లా ప్రజలందరికి శివాజి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పులిమామిడి రాజు మాట్లాడుతూ భారత దేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరతమాత ముద్దుబిడ్డ స్త్రీని గౌరవించి, హిందూ ధర్మానికి వన్నెతెచ్చిన వీరుడని తెలియజేశారు. నేటి యువత శివాజి మహారాజ్ సూచించిన బాటలో నడవాలని, తన పరిపాలనలో మహిళలకు పెద్ద పీఠ వేషారని, రైతులకు మంచి సుసంపన్నమైన పరిపాలన అందించారని పజలందరు కూడా వారి సూచనలను ఆచరణలో పెట్టాలని ప్రజలను కోరడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో శివాజి యూత్ అధ్యక్షులు ఆపిల్, కార్యదర్శి సాయి కుమార్, శివ, కార్యకర్తలు ప్రీతం, ఓంకార్, సుధీర్, విజయ్ కుమార్, వీరేశం, దత్తు, శీతల్ కుమార్ మరియు పీఎంర్ యువసేన నాయకులు అనిల్, గుణాకర్, చిన్న, వెంకట్, తాలెల్మ రమేష్, నల్ల సాయి కిరణ్, సోమశంకర్ మొదలగువారు పాల్గొన్నారు.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



# ఘనంగా శివాజీ జయంతి వేడుకలు




**ప్రధాన ఆకర్షణగా అశ్వాల నృత్యాలు**

**ఉత్సాహంతో పాల్గొన్న యువకులు**

**వాస్తవ నేస్తం,ముధోల్:** మండల కేంద్రమైన ముధోల్ లో సోమవారం వీరుడు ఛత్రపతి శివాజి మహారాజ్ 394 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్య మరాఠాల సంఘ భవనంలో పూజలు నిర్వహించి ఆయనకు నివాళు లర్పించారు. అదేవిధంగా యశ్వంత్ నగర్ లోని నలంద బుద్ద వీహార్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలను జరిపారు. అనంతరం జయంతి వేడుకల్లో భాగంగా పెద్ద ఎత్తున శోభాయాత్ర చేపట్టారు. శోభాయాత్ర మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగి శివాజీ చౌక్ వరకు నిర్వహించారు. ఇట్టి శోభాయాత్రలో డీజే పాటలపై యువకులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. శోభాయాత్రలో అశ్వాల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శోభాయాత్ర అనంతరం పలువురు మాట్లాడుతూ హిందూ స్వరాజ్యం కోసం పోరాడిన సాహస వీరుడని కొనియాడారు. ఆయనకు ధర్మం పట్ల ఉన్న నిబద్ధత నేటి యువకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. శోభాయత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముధోల్ సిఐ మల్లేష్, ఎస్సై సాయి కిరణ్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మరాఠా సంఘ నాయకులు, హిందూ వాహిని, దళిత సంఘాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పై అవగాహన



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలములోని గుమ్మిర్యాల్, నాగేంద్ర నగర్, దొంచంద, తాళ్లరాంపూర్, తడపాకల్ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను వైద్యాధికారి ప్రసన్న ప్రియ, సిబ్బంది సందర్శించారు. అనంతరం వారు విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ దృష్ట్యా వారికి ఎగ్జామినేషన్ మెలకువలు, మెమొరీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆకుల మారుతి, శ్యామల, వీణ,వంశీ, ఆశాలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

## కనకాపూర్ లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి





**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని కనకాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. ధైర్యానికి, పోరాటానికి, వీరులైన రాజుల్లో ప్రతిరూపంగా నిలిచారని వారు కొనియాడారు.దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల్లో శివాజీ ఒకరని,శివాజిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో విధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చాకలి గోపి, గీర్మాయిచిన్న దేవన్న,గాండ్ల, సురేష్, ఈర్ల రాజేందర్,కడయి శ్రీకాంత్,కొత్తూర్ వికాస్,కాడయి దేవేందర్, గోపు ప్రవీణ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుడికి ఘనంగా సన్మానం



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఎంపిటిసి జై సాగర్ రావు ని కనకాపూర్ గ్రామానికి చెందిన ఈ గిర్మాయి చిన్న దేవన్న, కదం సంతోష్ పటేల్, కొత్తూర్ సంజు శాలవులతో ఘనంగా సన్మానించారు. జై సాగర్ రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ముధోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్ మండల అధ్యక్ష పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి రాబోయే ఎంపీ ఎలక్షన్లో భారతీయ జనతా భారీ మెజారిటీతో గెలిపిద్దాం అన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మండల కేంద్రమైన జిన్నారం లోని పెద్దమ్మ గూడెం చౌరస్తాలో చత్రపతి శివాజీ 394వ జన్మదినం సందర్భంగా చత్రపతి యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం శోభయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చత్రపతి యూత్ అధ్యక్షులు సత్యనారాయణ యాదవ్, జనరల్ సెక్రెటరీ సీత రాజు యాదవ్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు వార్డు సభ్యులు, నాయకులు ప్రతాపరెడ్డి, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మేంద్ర గౌడ్ మహేందర్ గౌడ్, జగన్ రెడ్డి, నరేష్, శివ స్వాములు, దుబ్బాక మహేష్ యాదవ్, యూత్ సభ్యులు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లి తండ్రులని కోల్పోయిన ముగ్గురు పిల్లలకి అండగా నిలిచిన నీలం మధు

- అనాధ పిల్లలకు నీలం మధు అపన్నహస్తం
- భవిష్యత్తు లో సైతం అండగా ఉంటా


**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** గజ్వేల్ నియోజకవర్గం గజ్వేల్ మండలం కోల్గూరు గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్ డ్రైవర్ గా పనిచేస్తూ మరొక పక్క సొంత మాస్కురిగా పనిచేసేవాడు. ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మరణించాడు. భాస్కర్ కు భార్య కవిత తో పాటు ముగ్గురు పిల్లలున్నారు, భాస్కర్ మరణించడంతో పిల్లలకు కవిత అన్ని తానై వ్యవహరిస్తూ మాస్కురిగా ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పోషించుకుంది. అయితే విధి ఆడిన వింత నాటకంలో కవిత సైతం తీవ్ర ఆనారోగ్యంతో కన్నుమూసింది. దీంతో ముగ్గురు పిల్లలు కావ్య, శ్రీ వాణి, కుమార్ అనాధలై రోడ్డున పడ్డారు, కవిత కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో పిల్లల పోషణ ఇబ్బందిగా మారింది. సంవత్సరం వ్యవధిలో తల్లి దండ్రులను కోల్పోయి దిక్కు తోచని స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులకు కాంగ్రెస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ అండగా నిలబడి సోమవారం గజ్వేల్ మండలం కొల్గూర్ లో చిన్నారులను పరామర్శించి అండగా ఉంటానని ఆపన్న



హస్తం అందించారు. అనాధలుగా మారిన ముగ్గురు చిన్నారులకు ఆర్థిక సహాయం అందించి తన మంచి మనసుని మరోమారు చాటుకున్నారు. ముగ్గురు పిల్లలు అనాధలై తీవ్ర కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిన నీలం మధు పరిస్థితి విని చలించిపోయారు. ఆ పిల్లలకు అండగా నిలబడాలని నిర్ణయించుకుని పెద్ద మనసుతో ఒక్కొక్కరికి 50 వేల చొప్పున ముగ్గురికి కలిపి రూ. లక్ష యాభై వేల రూపాయలు పిల్లల పేర్లపైన ఫిక్స్ డిపాజిట్ చేశారు. అంతే కాకుండా పిల్లల బాగోగులు చూసుకోవడానికి తక్షణ ఖర్చుల కింద మరొక యాభై వేల రూపాయలను అందించి తన ఉదారతను చాటుకున్నారు, భవిష్యత్తులో సైతం పిల్లల చదువుల కోసం తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అమ్మ నాన్నలను కోల్పోయి బిక్కుబిక్కుమంటున్న పిల్లలకు నీలం మధు అండగా నిలబడి ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రాంతంతో సంబంధం లేకుండా ముగ్గురు చిన్నారులు కష్టంతో ఉన్నారని తెలియగానే వారిని పరామర్శించి అండగా నిలబడడన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మలం రాజు, ఎంపీటీసీ స్వామి, గుంటూరు శ్రీను రోటెల శ్రీను, డా.సత్యానారాయణ, రావుల రాజు కనకయ్య,నర్సింలు, మన్నే వెంకటయ్య,నర్సింలు, సాయి బాబా,సురేష్,రాజు,ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడే తెలంగాణ కంచి... కొడకంచి జాతర

- శ్రీ ఆదినారాయణ స్వామివారి దివ్య రథోత్సవం
- కంచికి వెళ్లకున్న కొడకంచి కి వెళ్లాలని ఇక్కడ ప్రతిదీ
- బంగారు బల్లి వెండి బల్లి కలిగిన క్షేత్రం

**వాస్తవ నేస్తం,పటాన్చెరు: పటాన్చెరు, ప్రజావార్త పత్రిక :** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో స్వయంభు వెలసిన 1000 ఏళ్ల చరిత్ర గల ఆలయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆదినారాయణ స్వామి ఆలయం ఈ యొక్క ఆలయంలో బంగారు బల్లి వెండి బల్లి కలిగిన క్షేత్రం ఈ ఆలయాన్ని దర్శించుకున్నట్లయితే తమిళనాడులోని ఉన్నటువంటి కంచి దేవాలయాన్ని దర్శించుకున్నట్లు ఇక్కడ ప్రతిదీ..ఈ యొక్క ఆలయ ప్రతి ఏటా మాఘ మాసం మొదలుకొని 15 రోజులపాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఏటా నేడు దివ్యమైన రథోత్సవం స్వామి వారి రథోత్సవం ఊరేగింపు గ్రామం అంతట కొనసాగుతుంది. ఈ యొక్క దివ్యమైన రథోత్సవ కార్యక్రమంలో అన్ని జిల్లాల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ యొక్క రథోత్సవ కార్యక్రమం జరుపబడుతుంది,తెలంగాణ కంచిగా పేర్కొన్న కొడకంచి జాతరలో నలుమూలల అన్ని రాష్ట్రాల ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులు పాల్గొంటారు. ఆలయ చైర్మన్ ఫౌండర్ ట్రస్ట్ అల్లాని రామోజీరావు మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్నింటిని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అంతే కాకుండా పోలీసుల బందోబస్తు జాతరలో ఇలాంటి అవాంఛనీయ కార్యక్రమాలు జరగ కుండా చూసుకున్నట్లు తెలిపారు.ఈ కొడకంచి జాతర మహోత్సవానికి పటాన్చెరు నుండి కొడకంచి వరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.




http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



## స్థానిక వార్తలు

## మనిషిలోని సకల రుగ్మతలకు విరుగుడు పుస్తకం





**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** మనిషిలోని సకల రుగ్మతలకు విరుగుడు పుస్తకమే అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నవతెలంగాణ పబ్లికేషన్స్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సందర్శించారు. ఈనెల 12 న ప్రారంభమైన ఈ ప్రదర్శన 25 వ తారీఖు వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు సతీష్ తెలిపారు. పుస్తక ప్రదర్శనను సందర్శించి సాహిత్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు, పిల్లలు పెద్దలు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు. ఈ సందర్భంగా 'గోరక్పూర్ ఆసుపత్రి ఘోర విషాదం' అన్న పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ చక్రపాణి , సీనియర్ జర్నలిస్ట్ పి.వి.రావు, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు ,నాగరాజులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజ్ గౌడ్, జీవి శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ నాయక్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద ప్రగతి రత్న జాతీయ అవార్డు అందుకున్న ఏర్పుల శ్రీనివాస్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** వల్లూరి ఫౌండేషన్ జాతీయ చైర్మన్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మహనీయుల స్ఫూర్తిగా జాతీయ అవార్డు పురస్కార కార్యక్రమంలో ప్రముఖులు మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల్ చారి, అడిషనల్ ఏ.ఎస్.పి తేజవత్ రామదాసు, సినీ నటులు పృథ్వీరాజ్, సంఖ్య శాస్త్ర నిపుణులు దైవాజ్ఞ శర్మ, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా దళిత రత్న ఏర్పుల శ్రీనివాస్ గద్దర్ అన్న జాతీయ అవార్డు పురస్కారాన్ని, స్వామి వివేకానంద ప్రగతిరత్న జాతీయ అవార్డు పురస్కారాన్ని అందించారు.

## తెలంగాణ పల్లెలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి

**ఎంపీపీ చందూరు వెంకటేశ్వరరావు**




**వాస్తవ నేస్తం,అనంతగిరి:** మండల పరిధిలో లకారం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ చందూరు వెంకటేశ్వరరావు ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 1వ వార్డులో 5 లక్షలతో సిసి రోడ్డు 4వ వార్డులో 15 లక్షలతో డ్రైనేజీ , సిసి రోడ్డు 6వ వార్డులో 5 లక్షలతో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి , వర్కింగ్ ప్రెసిడెంట్ బాణోత్ బాబు నాయక్ ,ప్రత్యేక అధికారి రవికుమార్, పిఆర్ఏఈ హర్ష, బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నరసింహారెడ్డి బుర్ర ప్రమోద్ రెడ్డి , గునుగుల గోపాల్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ నాగుల షేక్ కబీర్ సాహెబ్ , దేగ.కొండయ్య బాబిరెడ్డి, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే




**వాస్తవ నేస్తం,జుక్కల్:** నియోజకవర్గంలోని బిచ్కుంద మండలంలోని గుండె కల్లూరు గ్రామంలో రాజు పటేల్ యొక్క నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హాజరయ్యారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ ఎంపీ సురేష్ షెట్కర్, బిచ్కుంద మాజీ ఏఎంసి చైర్మన్ మల్లికార్జున అప్ప, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు హాజరయ్యారు.

## దశదిన కర్మలో పాల్గొన్న యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్




**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** 124-డివిజన్ శంశిగుడా ఆశా నగర్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ధాతి రమేష్ తండ్రి ధాతి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. నేడు వారి దశ దిశ కర్మ సందర్భంగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. కాశినాథ్ యాదవ్, రమేష్, నిరంజన్ యాదవ్, ఎడుపాయల శ్రీనివాస్, అంజయ్య యాదవ్, సంగారెడ్డి, క్రాంతిలాల్ తదితరులు ఉన్నారు.

# ప్రమాదకరంగా మారిన మధిర రైల్వే పై ఓవర్ బ్రిడ్జి..?





- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

**వాస్తవ నేస్తం,బోనకల్(మధిర):** మధిర పై ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణించాలంటే జనం ఇబ్బంది పడుతున్నారు. పై ఓవర్ బ్రిడ్జి పై ఏర్పడిన గుంతలతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు ఈ బ్రిడ్జి గుండ ప్రయాణం చేయాలంటే బిక్కుబిక్కుమంటున్నారు. అనునిత్యం మధిర రైల్వే పై ఓవర్ బ్రిడ్జి మీద అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో ఎక్కువగా టూ వీలర్స్, కార్ల మీద ప్రయాణం చేస్తుంటారు. వీరితో పాటుగా నడిచి వెళ్లే పాదచారులు కూడా పక్కన ఉన్న చిన్న దారిలో నడచుకుంటూ ప్రయాణం చేస్తుంటారు. ఈ బ్రిడ్జి మీద ప్రయాణం చేయాలంటే, వాహనముల మీద కానీ, పక్కన ఉన్న చిన్న దారిలో కానీ ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే రీతిలో, గుంటలు పడ్డాయి. ఇక బ్రిడ్జి మీద స్లాబుల మధ్య ఉన్న రబ్బర్ ప్యాడ్స్ దెబ్బతిని చాలాకాలం అయింది. అవి దెబ్బతినటం వలన వాటి కింద ఉన్న గుంటలు ఇంకా ఎక్కువగా దెబ్బతిని ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. పై ఓవర్ బ్రిడ్జి మీద సుమారు 23 చోట్ల రబ్బరు ప్యాడ్స్ ఉన్నాయి. వాటిలో ఎక్కువ భాగం రబ్బర్ ప్యాడ్స్ దెబ్బతిన్నాయి. దీంతో ఫ్లైఓవర్ పై వాహనదారులు ప్రయాణించాలంటే ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి దెబ్బతిన్న చోట మరమ్మత్తులు చేయగలరని, రబ్బర్ ప్యాడ్స్ పోయిన చోట రబ్బర్ పాడ్స్ వేయగలరని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# అయ్యప్ప స్వామి వార్షికోత్సవంలో పాల్గొన్న పులి మామిడి రాజు



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి 26వ వార్షికోత్సవంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అసెంబ్లీ ఇంచార్జ్ పులిమామిడి రాజు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. తదనాతరం ఆలయ కమిటీ వారు పులిమామిడి రాజుకు శాలువాతో ఘనంగా సత్కరించారు. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భగా రాజు మాట్లాడుతూ.. ఈ ఆలయం రోజు రోజు కు అభివృద్ధి చెందుతుందని, ప్రతి యేటా అయ్యప్ప మాలాధారణకు ఇక్కడికి వివిధ గ్రామాలనుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తారాని, ఈ దేవాలయం ముంబాయి హైవే రోడ్డు ప్రక్కన ఉండడం వలన భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని తెలియజేశారు. ఇంత మంచి వాతావరణాన్ని భక్తులకు అందిస్తున్నందుకు ఆలయ కమీటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు గోనె శంకర్ స్వామి, సుధాకర్ స్వామి, నాయుడు స్వామి, బీజేపీ నాయకులు కోవూరి సంగమేశ్వర్, ఓదెల మాణిక్ రావు, గొర్లిల్లా శివ లింగం, వి.శ్రీశైలం, నల్ల సాయి కిరణ్, విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు పవన్ గౌడ్, ఉల్లిగడ్డల నాగన్న, విశ్వనాథం పటేల్, కృష్ణ రెడ్డి, రాచన్న స్వామి, మరియు భక్తులు పాల్గొన్నారు.

## తాళ్లరాంపూర్ సొసైటీ ఫంక్షన్ హాల్ రి టెండర్

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని తాళ్లరాంపూర్ సొసైటీ ఫంక్షన్ హాల్ గతంలో ఆన్లైన్ టెండర్ నిర్వహించినప్పటికి వరూ ముందుకు రాకపోవడంతో మళ్లీ రీ-టెండర్ జిల్లా సహకార అధికారి నిజామాబాద్ వారు వేస్తున్నట్టు సొసైటీ చైర్మన్ పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా కొనుగోలు చేసేవారు ఈ నెల 20వ తేది మంగళవారం నుండి 29వ తేది గురువారం, వరకు 10 రోజుల గడువులో జిల్లా సహకార ఆఫీస్ నందు జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు ను సంప్రదించి ఆన్లైన్ టెండర్లో పాల్గొనాలని తెలిపారు.

## పాలమూరులో నువ్వా.. నేనా...

**మహబూబ్ నగర్ :** అసలే కాంగ్రెస్ పార్టీ తరఫున పీసీసీ ఛీఫ్, సీఎం రేవంత్ రెడ్డి ఇంఛార్జ్జా ఉన్న నియోజకవర్గం అది. గులాబీ పార్టీ ఆ పార్లమెంట్ సెగ్మెంట్?లో ఒక్కఎమ్మెల్యే సీటు గెలవలేదు. సిట్టింగ్ అభ్యర్థి బలహీనంగా కనిపించడంతో గట్టిఅభ్యర్థినే నిలబెట్టాలనే సంకల్పంతో ఉంది అధిష్టానం. ఎంత మందినిసం ప్రదించినా అందరూ పక్కకు తప్పుకుంటున్నారు. చివరికి ఆ నేత మెదకేపార్లమెంట్ అభ్యర్థిగా దండేయనున్నట్లు చర్చలు నడుస్తున్నాయి. పాలమూరుపాలిటిక్స్ రసవత్తరంగా సాగుతున్నాయి. ఓ పక్క కాంగ్రెస్, బీజేపీలో నేనంటేనేను అంటూ ఎంపీ టికెట్ కోసం నేతలు క్యూ కడుతుంటే.. నిన్నటి వరకురాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్?లో మాత్రం పరిస్థితి భిన్నంగాకనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి భయానికి ఎంపీ ఎన్నికల్లోపోటీకి నేతలేవరూ ముందుకు రావడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నేపథ్యంలోపార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలనే బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సవాల్?గాతీసుకుంది. అందులో భాగంగా ఎంపీ ఎన్నికల్లో బలమైన అభ్యర్థలతో బరిలోదిగాలని భావిస్తోంది.ముఖ్యంగా మహబూబ్?నగర్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్,బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో వారికి ధీటుగా అభ్యర్థినిదింపాలను కుంటున్నారు. సిట్టింగ్?ను కాదనీ బలమైన నేతనే పోటీ చేయించాలనిగులాబీ

# బుల్లితెరకే ఫిక్స్ కావడానికి కారణం



బుల్లితెర జబర్దస్త్ షో ద్వారా హాట్ యాంకర్ గా పాపులర్టి దక్కించుకుంది రష్మీ. అయితే రేష్మి కెరీర్ స్టార్టింగ్ లో పలు సీరియల్స్ లో నటించిందని విషయం చాలామందికి తెలియదు. అంతేకాదు సినిమాల కంటే టీవీనే బెటర్ అని ఆమె నిర్ణయించుకోవడానికి కూడా ఆసక్తి గల కారణం ఉంది. దీనికి సంబంధించిన విషయాలను ఇటీవల రివీల్ చేసింది రష్మి. ప్రస్తుతం జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ లాంటి బుల్లితెర కామెడీ షోలకు యాంకర్ గా దూసుకుపోతున్న ఈ ముద్దుగుమ్మ.. తన అభినయంతో ఆకట్టుకుంటుంది. పదేళ్లుగా షోని సక్సెస్ ఫుల్గా రన్ చేయడంలో కీలక పాత్ర వహించిన ఈ హాట్ బ్యూటీ.. బుల్లితెరకే పరిమితం కావడానికి టీవీని నమ్ముకోవడానికి కారణం ఏంటో ఒకసారి చూద్దాం. యాంకర్ రష్మి కెరీర్ ప్రారంభంలో 2002 - 3 సంవత్సరాలలో థ్యాంక్స్ అనే సినిమాలో నటించింది. ఇందులో హీరోయిన్గా రొమాన్స్ తో రెచ్చిపోయింది. గ్లామర్ ట్రీట్ అప్పట్లోనే వేరే లెవెల్ లో చేసిన ఈ బ్యూటీ.. ఇటీవల యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని వివరించింది. ఆమె సినిమా ఇప్పటికీ యూట్యూబ్లో స్ట్రీమ్ అవుతుందట. అయితే ఈ సందర్భంగా పలు ఇంట్రస్టింగ్ విషయాలను వివరించింది.

# మృణాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్..



‘ సీతారామం ‘ మూవీ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది మృణాల్. మొదటి మూవీతోనే భారీ బ్లాక్ బస్టర్ సొంతం చేసుకుని ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్గా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ తర్వాత వరుసగా టాలీవుడ్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటూ క్రేజీ బ్యూటీగా దూసుకుపోతుంది.మొదట మృణాల్ మరాఠీ, హిందీ భాషల్లో పలు సినిమాల్లో నటించిన ఊహించిన రేంజ్లో సక్సెస్ అందలేదు. అయితే తెలుగులో మాత్రం నటనతో ప్రేక్షకులను ఫిదా చేసిన మృణాల్కు వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. తెలుగుతో పాటు తమిళ్ లోను వరుస సినిమా ఆఫర్లను అందుకుంటు దూసుకుపోతున్న ఈమె ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సందడి చేసింది. మృణాల్ మాట్లాడుతూ తన మొదటి సినిమా సీతారామం తో ఎన్నో జ్ఞాపకాలు, అనుభవాలు ఉన్నాయంటూ వివరించింది. ఆమె తన కో యాక్ట్రెస్ అయినా దుల్కర్ సల్మాన్, రష్మిక మందన పై చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. రష్మిక మందన ఎనర్జీ చూస్తే ఒక్కొక్కసారి షాక్ అవుతానని.. ఎన్ని గంటలు పనిచేసిన ఆమెలో అసలు కొద్దిగా కూడా అలసట కనిపించదు అంటూ వివరించింది. పాత్రల విషయంలో కూడా ఎప్పటికప్పుడు విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ సినిమాల్లో నటిస్తుందంటూ చెప్పిన ఆమె.. సీతారామంలో అఫ్రీన్ లాంటి క్యారెక్టర్ చేయాలంటే చాలా గట్స్ ఉండాలి.. ఆ సినిమాను ఆమె తప్ప మరెవ్వరు చేయలేరు అనిపించింది అంటూ రష్మికను పొగడ్తలతో ముంచేసింది. దుల్కర్ సల్మాన్ గురించి వివరిస్తూ.. ఏ భాషలో మంచి పాత్ర దొరికిన వెంటనే యాక్సెప్ట్ చేసి.. ఆ క్యారెక్టర్ లో ఒదిగిపోవడం ఆయనకు సినిమా పట్ల ఉన్న ప్యాషన్కు నిదర్శనం అంటూ వివరించింది.

# ఎల్లో శారీలో పూజ హెగ్డే అందాలు..



పూజా హెగ్డే గ్లామర్ షో గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇటు టాలీవుడ్, అటు బాలీవుడ్ లో పూజా హాట్ టాపిక్ గా మారుతోంది. సౌత్ లో పూజా అత్యధిక రెమ్యునరేషన్ అందుకునే హీరోయిన్లలో ఒకరు.పూజా హెగ్డే క్యూట్ లుక్, సెక్సీ అందాలు కుర్రాళ్లకు నిద్ర దూరం చేస్తుంటాయి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే పూజా హెగ్డే తరచుగా గ్లామరస్ ఫోటో షూట్స్ చేస్తూ ఉంటుంది. వరుసగా సూపర్ హిట్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన ఈ అమ్మడుకు ప్రస్తుతం కాలం కలిసిరావడంలేదు. దురదృష్టం వెంటాడుతోందని చెప్పొచ్చు. గతేడాది వరుసగా నాలుగు డిజాస్టర్లు చవిచూడటంతో నిర్మాత, దర్శకులు, హీరోలు అమ్మడును దూరం పెట్టడం ప్రారంభించారు. సినిమా అవకాశాలు రావడంలేదని బాధపడుతున్న తరుణంలోనే గుంటూరు కారం, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు కూడా బుట్టబొమ్మ నుంచి దూరమయ్యాయి. నాగచైతన్య సరసన ఒక లైలాకోసం సినిమాతో తెలుగు పరిశ్రమకు పరిచయం అయిన ఈ భామ ముకుంద సినిమాతో ప్రేక్షకులకు దగ్గరైంది. ఆ తర్వాత హృతిక్ రోషన్ సరసన మొహంజదారో సినిమాలో అవకాశం రావడంతో బాలీవుడ్ ను ఏలడానికి టాలీవుడ్ ను వదిలివెళ్లింది వరుసగా సూపర్ హిట్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన పూజా హెగ్డే. అయితే ఆ సినిమా ఫ్లాప్ కావడంతో గోడకు కొట్టిన బంతిలా మళ్లీ తిరిగివచ్చింది. తాజాగా వరుసగా సూపర్ హిట్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన తెలుగుదనం ఉట్టిపడేలా మంత్రముగ్ధులను చేసింది. ఎల్లో చీరకట్టులో అందమైన బుట్టబొమ్మలా, నుదుటిపై పెద్ద బొట్టు, మెడలో అలంకరించే ఆకుపచ్చ హారము, జుట్టులో మల్లెపూల క్యాస్కేడ్ ఆకట్టుకుంది.



# ఆ లవ్ ఎప్పుడు స్పెషల్ అంటూ..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి పరిచయం అవసరంలేదు. ఏ మాయ చేసావే సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీ హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చి అతి తక్కువ సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా మంచి క్రేజ్ సంపాదించుకుంది. మహేష్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్, నాగ చైతన్య, విజయ్ దేవరకొండ లాంటి అగ్ర హీరోల సరసన నటించి మెప్పించింది. తెలుగు తో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సూపర్ హిట్ సినిమాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కెరీర్ మంచి ఫామ్లో ఉన్న టైంలో ప్రేమ, పెళ్లి, విడాకులు అంటూ ఆమె జీవితం ఒక్కసారిగా మలుపు తిరిగింది. అక్కినేని నాగచైతన్యతో ప్రేమ, పెళ్లి నాలుగేళ్లకు విడాకులు తీసుకోవడంతో సామ్ పేరు సోషల్ మీడియాలో మారుమోగిపోయింది. ముఖ్యంగా ఆమెపై భారీ నెగిటివిటీ, విమర్శలు వచ్చాయి. అయినా వాటన్నింటిని పట్టించుకోకుండా మళ్లీ తన కెరీర్ పై ఫోకస్ పెట్టిన సామ్.. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓ వైపు మయో సైటీస్ వ్యాధితో బాధపడుతూనే.. మరొకవైపు వరుసగా నటించి మెప్పించింది. ఇకపోతే ప్రస్తుతం అ సమస్యలన్నింటిని ఎదుర్కొని మళ్ళీ రీ ఎంట్రీ ఇచ్చే ప్రయత్నంలో ఉంది సమంత. ఈ క్రమంలో రీఎంట్రీ పై హింట్ ఇచ్చింది. దీంతో సామ్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు నెట్టింట యాక్టివ్గా ఉండే సమంత చాలా కాలం తర్వాత ప్రేమ గురించి ఓ పోస్ట్ షేర్ చేసుకుంది. కొన్ని లేటెస్ట్ ఫోటోస్ ని షేర్ చేస్తూ ఆసక్తికర విషయాన్ని వివరించింది. తాజాగా సామ్ తన సొంతూరు చెన్నై వెళ్లింది. అక్కడే ఉన్న సత్యభామ యూనివర్సిటీలో ఒక ఈవెంట్లో సందడి చేసింది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com